

# పోటెత్తిన భక్తజనం

**-ఖైరతాబాద్ వినాయకుడికి గవర్నర్ చేతుల మీదుగా తొలి పూజ**

**-ఈ ఏడాది 69 అడుగుల విశ్వశాంతి మహాశక్తి గణపతి**

హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త

ఖైరతాబాద్‌లో కొలువైన 69 అడుగుల విశ్వశాంతి మహాశక్తి గణపతి దర్శనానికి భక్తులు లక్షలాదిగా తరలివచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకూ రద్దీ కొనసాగింది. ఓ వైపు వర్షం కురుస్తున్నా భక్తులు మహా గణపతిని దర్శించుకునేందుకు క్యూ కట్టారు. బుధవారం గవర్నర్ జిష్ణు దేవ్‌శర్మ చేతుల మీదుగా తొలి పూజ ప్రారంభించారు. వర్షంలోనూ గవర్నర్ దంపతులు బడా గణేష్ తొలి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఖైరతాబాద్ గణేశుడికి 15 కిలోల వెండి కడియం, వెండి జంజం సమర్పించారు స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్,

**క్యూలైల్లో ప్రసవించిన మహిళ..**

వినాయక చవితి సందర్భంగా ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించేందుకు భక్తులు బుధవారం తెల్లవారుజాము నుంచే క్యూ కట్టారు. ఈ సందర్భంగా మహా గణపతిని దర్శించుకునేందుకు వచ్చిన ఓ గర్భిణీ క్యూలైన్‌లోనే ప్రసవించింది.ఖైరతాబాద్ మహా గణనాథుడి తొలిపూజ సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రసవించిన మహిళను రాజస్థాన్‌కు చెందిన రేష్మగా గుర్తించారు. ప్రసవం అనంతరం గణేశ్ ఉత్సవ నిర్వాహకులు.. మహిళను పక్కనే ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రస్తుతం తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.



ఖైరతాబాద్ వినాయకుడి విగ్రహం వద్ద నృత్యం చేస్తున్న దృశ్యం



హైదరాబాద్ వార్త

# నిఘా నీడలో నిమజ్జనం

**-కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి నిరంతర పర్యవేక్షణ**

**-30 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు**

**-భాగ్యనగరంలో సుమారు 26 వేల వినాయక విగ్రహాల ఏర్పాటు**

**-నిమజ్జన ఊరేగింపు సాఫీగా సాగేలా సహకరించాలని సిపి సూచన**



ట్యాంక్‌బండ్ వద్ద నిమజ్జన పాయింట్లను పరిశీలిస్తున్న సీపీ సి.వి.ఆనంద్, అడిషనల్ సీపీ విక్రమ్‌సింగ్‌మాన్, ట్రాఫిక్ జాయింట్ సీపీ డి.జోయల్ డేవిస్, ఎస్.బి డీసీపీ కె. అపూర్వా రావు, సెంట్రల్ జోన్ డీసీపీ కె. శిల్పావల్లి తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** ఈ ఏడాది వినాయక నిమజ్జనం పోలీసుల నిఘా నీడలో జరగనున్నట్లు హైదరాబాద్ సీపీ సివి. ఆనంద్ తెలిపారు. సెప్టెంబర్ 6వ తేదీన నిర్వహించే గణేష్ విగ్రహాల నిమజ్జనానికి హైదరాబాద్ సిటీ పోలీసుల తరపున విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు చేయబడ్డాయన్నారు. గణేష్ ఉత్సవాల కోసం హైదరాబాద్ పోలీస్ విభాగాల నుండి దాదాపు 19,000 మంది పోలీసులు అందుబాటులో ఉంటారని, ఇతర జిల్లాల నుండి అదనంగా 8,500 మంది పోలీసులు, 42 ప్లాటూన్లు, 10 సీఏపీఎఫ్ కంపెనీలు, ఆక్టోపస్ బృందాలు కలిపి మొత్తం సుమారు 30,000 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. నిమజ్జన ఊరేగింపు దృశ్యాలను సీసీటీవీ కెమెరాలు, డ్రోన్లు, క్యూఆర్ కోడ్ ఆధారిత స్టిక్కర్లతో పర్యవేక్షించనున్నట్లు వెల్లడించారు. వినాయక ఉత్సవాలు సజావుగా సాగేందుకు ఉత్సవాల నిర్వాహకులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, వివిధ ప్రభుత్వ శాఖలతో సమన్వయ సమావేశాలు నిర్వహించామని తెలిపారు. సిటీలో దాదాపు 11,000 దరఖాస్తులలో 10,900 గణేష్ మండపాలకు ఆన్‌లైన్‌లో అనుమతులు చేశామని, మిగిలిన సుమారు 15,000 విగ్రహాలను కూడా రికార్డుల్లోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామని, దీనివల్ల బందోబస్తు చర్యలు చేపట్టడం సులభమవుతుందని చెప్పారు.

**నిమజ్జన పాయింట్లను పరిశీలించిన సీపీ..**

భాగ్యనగరంలో వినాయక ఉత్సవాలు అంగరంగా వైభవంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివి.ఆనంద్ ఖైరతాబాద్ బడా గణేష్ దర్శనం చేసుకొని, స్వామి వారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. హైదరాబాద్ కమిషనర్‌గా గణేష్ విగ్రహము ప్రతిష్ఠించిన రెండవ రోజునే ఖైరతాబాద్ గణేష్‌ను సందర్శించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. తాను దాదాపు 25 సంవత్సరాలుగా ప్రజలందరితో మమేకమై ఉన్నానని చెప్పారు. తాను సెంట్రల్ జోన్ డీసీపీగా, అడిషనల్ సిపి ట్రాఫిక్, హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా ఇప్పటివరకు 11 సార్లు గణేష్ నిమజ్జన బందోబస్తులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అనంతరం సీపీ.. ఇతర అధికారులతో కలిసి ఖైరతాబాద్ గణేష్ మండపానికి వెళ్లే దారులను, బారికేడింగ్ వ్యవస్థను పరిశీలించారు. గణేష్ విగ్రహాలు మూడవ రోజు నుండి నిమజ్జనానికి వస్తాయి కాబట్టి, ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్, ఇతర నిమజ్జన పాయింట్లను కూడా పరిశీలించారు. శాంతియుతంగా ఉత్సవాలు నిర్వహించడానికి ప్రజల సహకారం కోరుతున్నామని తెలిపారు.

**అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏర్పాట్లు..**

ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ సమితి వారు నిమజ్జనానికి ఒక రోజు ముందు నుండే ఏర్పాట్లు చేస్తారని, శనివారం మధ్యాహ్నం వరకు నిమజ్జనం పూర్తయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఖైరతాబాద్ గణేష్ విగ్రహాన్ని రోజువారీగా 60 నుండి 70 వేల మంది సందర్శిస్తున్నారు. ఈ సంవత్సరం బోనాలు, ఇతర పండుగలకు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నందున, ఖైరతాబాద్ గణేష్ ను సందర్శించడానికి కూడా భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉందని, కావున ఎలాంటి తొక్కిసలాట జరగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వారాంతాల్లో లక్ష నుండి రెండు లక్షల మంది భక్తులు వస్తున్నందున, ఎక్కువ మంది పోలీసులను నియమించి, గట్టి నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలు, భక్తులు, ఉత్సవ సమితి సభ్యులు పోలీసులతో సహకరించాలని కోరారు. రాబోయే పది రోజులు వర్షాలు ఉన్నందున, బందోబస్తు విధుల్లో ఉన్న తమ సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు.

**24 గంటల నిరంతర నిఘా..**

ప్రస్తుతం వర్షాలు ఎక్కువగా పడుతున్నందున మండప నిర్వాహకులు కరెంటు విషయంలో చాలా జాగ్రత్త వహించాలని కోరారు. ఉచిత విద్యుత్తు ఇస్తున్నప్పటికీ, నిర్వాహకులు స్థానిక విద్యుత్తు శాఖాధికారులను సంప్రదించి సరైన పద్ధతిలో కనెక్షన్ తీసుకోవాలని సూచించారు. వర్షానికి తడిసిన కట్టెలు కూడా విద్యుత్తు వాహకాలుగా మారే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రాత్రిపూట కనీసం 2 లేక 3 వాలంటీర్లు మండపం వద్ద ఉండాలని తెలిపారు. ముఖ్యమైన ప్రాంతాలైన ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా వద్ద ఉమ్మడి నియంత్రణ కేంద్రాలను ఏర్పాటు చేశామని, చివరి నిమజ్జనం రోజు బంజారా హిల్స్‌లోని టీజీ ఐసీసీసీ వద్ద 24 గంటలూ పనిచేసే విధంగా ఉమ్మడి నియంత్రణ కేంద్రం ఉంటుందని హుస్సేన్ సాగర్, మీరాలం ట్యాంక్, రాజన్న భావి, ఎన్టీఆర్ స్టేడియం వంటి ప్రాంతాలలో ప్రస్తు తం 9 క్రేన్లను ఏర్పాటు చేశామని, జిహెచ్ఎంసి, ఆర్ అండ్ బి, ఇతర శాఖల సమన్వయంతో చివరి రోజు వరకు ఈ సంఖ్యను 40కి పెంచుతామని సీపీ సి.వి.ఆనంద్ తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ సీపీ విక్రమ్ సింగ్ మాన్, జాయింట్ సీపీ ట్రాఫిక్ డి. జోయల్ డెవిస్, ఎస్.బి డీసీపీ కె. అపూర్వా రావు, సెంట్రల్ జోన్ డీసీపీ కె. శిల్పావల్లి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బిసి విద్యార్థులు చదువుకుంటే ప్రభుత్వం ఓర్వ లేక పోతోంది : ఆర్. కృష్ణయ్య



మాసబ్ ట్యాంక్ లోని సంక్షేమ భవన్ ముందు ధర్నాకు దిగిన ఆర్ కృష్ణయ్య

**మెహిదీపట్నం, ఆగస్టు 28, ప్రభాతవార్త :** బీసీ విద్యార్థులు చదువుకుంటే ప్రభుత్వం ఓర్వలేకపోతుందని, అందుకే విద్యార్థులకు స్కాలర్ షిప్ ఫీజులు విడుదల చేయడం లేదని రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ విద్యార్థులతో ఆడుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. స్కాలర్ షిప్ ఫీజు బకాయిలు చెల్లించడంతోపాటు రాష్ట్రంలో 119 బీసీ గురుకులాలు, 100 బిసి కాలేజీ హాస్టల్స్ మంజూరు చేయాలన్న డిమాండ్ తో గురువారం మాసబ్ ట్యాంక్ లోని సంక్షేమ భవన్ పై బీసీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో మెరుపు దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ భవన్ వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. పెద్ద ఎత్తున విద్యార్థులు తరలిరావడంతో సంక్షేమ భవన్ విద్యార్థుల నినాదాలతో దద్దరిల్లింది. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.... విద్యార్థులతో పెట్టుకుంటే ప్రభుత్వానికి పుట్టగతులు ఉండమన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు కూడా విద్యార్థులతో పెట్టుకున్న ఎక్కువ రోజులు మనుగడ సాగించలేదు అన్నారు. బీసీ విద్యార్థులు చదువుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఓర్వలేక పోతుందన్నారు. అందుకే బడ్జెట్ లో బీసీ విద్యార్థుల కోసం బడ్జెట్ కేటాయించిన విడుదల చేయడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్రంలో 14 లక్షల మంది కాలేజీ విద్యార్థుల ఫీజు బకాయిలు 6వేల కోట్లు పెండింగ్ లో ఉన్నాయన్నారు. ఫీజు బకాయాలను ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. విద్యార్థులు గత కొన్ని నెలలుగా ఉద్యమాలు చేస్తున్న ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో 119 బీసీ గురుకులాలు మంజూరు చేయడంతో పాటు గురుకుల పాఠశాలలో 20 శాతం సీట్లు పెంచాలని డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలను చెల్లించాలని, లేకుంటే ప్రజా ప్రతినిధులను తిరగనివ్వమని హెచ్చరించారు. ధర్నాలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు గుజ్జ కృష్ణ, నందగోపాల్, సుధాకర్, రవికుమార్ యాదవ్, చందు, అరవింద్, నిఖిల్ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఉత్తమమైన విద్యను అభ్యసించేలా చర్యలు

**-కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**



బోరబండ సైట్3లోని ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్ క్లీనింగ్ మిషన్లను అందజేస్తున్న కేంద్ర బొగ్గు గనుశాఖ మంత్రి కిషన్‌రెడ్డి.

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 28, ప్రభాతవార్త** ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించి ఉత్తమమైన విద్యను అభ్యసించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యులు గంగాపురం కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం బోరబండ ప్రాంతంలోని సైట్3 పెద్ద మ్మనగర్‌లోని నాట్కో హైస్కూల్, పెద్దమ్మ గుడినగర్ ఉర్దూమీడియం స్కూల్, స్వరా జ్‌నగర్‌లోని హైస్కూల్‌లను సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఉపయోగపడే విధంగా టాయిలెట్ క్లీనింగ్ మిషన్లను ఆయా పాఠశాల ప్రన్సి పాల్లకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లోని తరగతి గదులను ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో మనం ఉపయోగించే టాయిలెట్లను కూడా అంతే శుభ్రంగా ఉంచుకో వాలన్నారు. విద్యార్థులు, చదువుపై శ్రద్ధ ఉంచి ఉత్తమ మార్కులు సాధించి తల్లిదండ్రులకు ఉపాధ్యయులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఇప్పటికే పాఠశాల ల్లోని పలు సమస్యలు తమ దృష్టికి వచ్చాయని వాటన్నింటిని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డీఈవో రోహిణి, డిప్యూటీ ఈవో శామ్యూల్ రాజు, డిప్యూటీ ఐవోఎస్ శ్రావణ్‌కుమార్, నాట్కో స్కూల్ ప్రిన్సిపల్ కే.గీత, ఉర్దు మీడియం స్కూల్ ప్రమీల రాణి, స్వరాజ్‌నగర్ పాఠశాల ప్రన్సిపల్ విజయలక్ష్మి, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు లంకల దీపక్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, బోరబండ డివి జన్ బీజేపీ అధ్యక్షులు కొత్త వెంకటేష్, సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్, జూటూరి కీర్తిరెడ్డి, మాజీ అధ్యక్షులు కృష్ణమోహన్, శర్మిల జాదవ్, సుప్రియా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వరద ముప్పు తప్పించిన హైడ్రా

**-ఊపిరి పీల్చుకున్న ఓయూ కాలనీవాసులు**

**-హైడ్రా కమిషనర్‌కు స్థానికుల అభినందనలు**



వరద కాలువను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ ఎ.వి రంగనాథ్

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:**

షేక్‌పేట డివిజన్‌లోని ఓయూ కాలనీలో హైడ్రా కమిషనర్‌రంగనాథ్ గురువారం పర్యటించారు. ఇటీవల వర్షాలకు నీట మునిగిన కాలనీలో వరద ముప్పును నివారిస్తూ చేపట్టిన కాలువల అనుసంధాన పనులను పర్యవేక్షించారు. ఓయూ కాలనీలోని ఆదిత్యా నగర్, రాహుల్‌నగర్, బృందావన్, సూర్యనగర్ కాలనీల మీదుగా సాగే వరద కాలువను మణికొండ మున్సిపాలిటీలోని ఆంబియన్స్ కోర్టు యార్డు గేటెడ్ కమ్యూనిటీ ముందు నుంచి వెళ్లే లైనుకు అనుసంధానం చేస్తూ చేపట్టిన పనులను పరిశీలించారు. ప్రత్యేకంగా పైపు లైను వేసిన ప్రాంతాలను, షేక్‌పేట కొత్త చెరువు నుంచి ఆదిత్యనగర్ మీదుగా శాతం చెరువును అనుసంధానిస్తూ సాగే వరద నీటి కాలువ కబ్జాలను హైడ్రా కమిషనర్ పరిశీలించారు. వరద ప్రవాహానికి ఆటంకం లేకుండా చూడాలని.. అవసరమైన చోట నాలా వాస్తవ వెడల్పు ఉండేలా చూడాలని సూచించారు. ఓయూ కాలనీలో వరద ముప్పును నివారించినందుకు గాను హైడ్రా కమిషనర్‌ను షేక్‌పేట కార్పొరేటర్ రాషెద్ ఫరాజుద్దీన్ శాలువతో సన్మానించారు. అలాగే స్థానికులు కూడా కమిషనర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అలాగే జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 19 లో నాలాను ఆక్రమించినట్టు వచ్చిన ఫిర్యాదును పరిశీలించారు. ఇక్కడ నాలాను ఆక్రమించడమే కాకుండా.. సెల్లార్ కోసం గుంత తవ్వి వెంటనే నిర్మాణ పనులు చేయకపోవడంతో చుట్టుపక్కల ఇళ్లకు ఇబ్బందిగా పరిణమించిందన్న ఫిర్యాదును క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. నాలా ఆక్రమణను ఉపేక్షించేది లేదని.. ఇతరులకు ఇబ్బంది లేకుండా పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

**పాటిగడ్డలో వర్షానికి కూలిన రేకుల ఇల్లు..ఒకరికి గాయాలు**

**బేగంపేట ఆగస్టు 28,ప్రభాతవార్త :** నగరంలో నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బేగంపేట పాటిగడ్డలో ఒక రేకుల ఇల్లు కూలిపోయింది.ఇంట్లో ఉన్న దాసు అనే వ్యక్తికి గాయాలయ్యాయి.గాయాలైన వ్యక్తిని వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.ఇల్లు కూలిన సమయంలో ఇంట్లో కుటుం బసభ్యులు ఉండి ఉంటే మరింత మంది గాయపడే అవకాశం ఉండేది. ఒక్కడే ఉండటంతో అతనికి మాత్రమే గాయాలయ్యాయి.

**పురాతన ఇళ్లలో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలి బేగంపేట ఏసీపీ గోపాల కృష్ణమూర్తి.**

బేగంపే ట డివిజన్ పరిధిలో పురాతనమైన ఇళ్లలో ఉండే వారు నగరంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని,బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి సూచించారు. అలాగే నాలా పక్కన నివసించే వారు సైతం అప్రమత్తంగా ఉండాలని,నాలాలో నీటి ఉధృతి పెరిగిన సమయంలో బస్తీలోకి నీరు చేరే అవకాశం ఉన్నందున కూకట్‌పల్లి నాలా పరివాహక బస్తీలైన వడ్డెరబస్తీ,బ్రాహ్మణవాడీ,చికోటి గార్డెన్,ప్రకాశంనగర్ ఎక్స్ టెన్షన్,ఎన్‌బిటీనగర్,పాటిగడ్డ వాసులు అప్రమత్తంగా ఉండాలన్నారు.అలాగే పాత ఇళ్లలో నివసించే వారు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు.బస్తీల్లోకి భారీగా నాలా నీరు చేరిన పక్షంలో ఆ సమాచారాన్ని బేగంపేట పోలీసులకు అందించాలన్నారు.వెంటనే తాము వారికి తమ సిబ్బంది రక్షణగా నిల్చి వారిని అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామన్నారు.

# నిమజ్జనానికి 20చెరువులు..74 పాండ్స్

**-పటిష్టమైన ఏర్పాట్లు చేసిన జిహెచ్ఎంసి**

**-మూడు షిఫ్టుల్లో పనిచేయనున్న శానిటేషన్ వర్కర్స్**

**-ఎప్పటికప్పుడు వ్యర్థాలు తొలగించేలా చర్యలు**



**హైదరాబాద్, ఆగస్టు 28,ప్రబాతవార్త:** గ్రేటర్‌లో గణేష్ ప్రతిమల నిమజ్జన కార్యక్రమం సాఫీగా, వేగంగా జరిగేలా చూసేందుకు జీహెచ్ఎంసీ పటిష్టమైన ఏర్పాట్లు చేస్తుంది. అందుకు జిహెచ్ఎంసి పరిధిలో 74 కృత్రిమ నిమజ్జన కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రతి నిమజ్జన పాండ్ వద్ద ఒక ఇంచార్జీ అధికారి, నోడల్ అధికారి, ఓవరాల్ ఇంచార్జీ గా సంబంధిత డిప్యూటీ కమీషనర్, ఉంటారు. అలాగే క్రేన్లు, కంట్రోల్ రూమ్, మెడికల్ క్యాంపు, ఎప్పటి కప్పుడు వ్యర్థాలను తొలగించేందుకు శానిటేషన్ సిబ్బంది తో పాటుగా వాహనాలను ఏర్పాటు చేసి సాఫీగా నిమజ్జనం జరిగేలా సిబ్బంది మూడు షిఫ్ట్ లలో పని చేస్తారు. హుస్సేన్ సాగర్, సరూర్ నగర్ చెరువు, ఐడిఎల్ చెరువు, సఫిల్‌గూడ చెరువు, సున్నం చెరువు సహా 20 ప్రధాన చెరువులతో పాటు ఈ 74 కృత్రిమ కుంటలలో నిమజ్జనం జరుగనుంది. అందులో తాత్కాలిక పోర్టబుల్ వాటర్ ట్యాంకులు - 24, బశాశ్వత బేబీ పాండ్లు 27 తాత్కాలిక ఎక్స్కవేషన్ పాండ్లు 23 సిద్దం చేశారు. తద్వారా ప్రధాన చెరువుల పై ఒత్తిడి తగ్గించడమే కాకుండా సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా సమీపంలో గణేష్ విగ్రహాల నిమజ్జనంకు కృత్రిమ నిమజ్జన పాండ్ లను జిహెచ్ఎంసి ఏర్పాటు చేసింది.

**74 కృత్రిమ నిమజ్జన కేంద్రాలు ఇవే..**

**తాత్కాలిక పోర్టబుల్ వాటర్ ట్యాంకులు..**

ఎగ్జిబిషన్ గ్రౌండ్స్- ఏ.ఎస్.రావు నగర్, సచివాలయ నగర్- ఆఫీసర్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ గ్రౌండ్స్ 3.ఎం.ఆర్.ఓ.ఆఫీస్ -హయత్‌నగర్, క్రికెట్ గ్రౌండ్, స్విమ్మింగ్ పూల్ పక్కన, సుష్మా థియేటర్- వనస్థలిపురం, గవర్నమెంట్ కాలేజ్ గ్రౌండ్, మున్సిపల్ ఆఫీస్ వెనుక, శివాలయం గ్రౌండ్- రియాసత్‌నగర్,. లక్ష్మణేశ్వర ప్లేగ్రౌండ్ -జంగం మెట్, రామ్ లీలా గ్రౌండ్ -చింతల్ బస్తీ, ఎస్‌బిఏ గార్డెన్ ఎదురుగా, 100 అడుగుల రోడ్డు,నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్, అమీర్‌పేట్ ప్లేగ్రౌండ్‌లలో ఏర్పాటు చేశారు.

**తాత్కాలిక ఎక్స్కవేషన్ పాండ్లు..**

దేవేందర్ నగర్ రోడ్, హుడా భారతి నగర్ పార్క్, జెడ్.పి.రోడ్, హస్తినాపురం, ఎన్.టి.ఆర్.నగర్ వెజిటబుల్ మార్కెట్, ఫ్రెండ్స్ కాలనీ షటిల్ కోర్ట్, ఎస్‌బిహెచ్ కాలనీ, సైదాబాద్, బతుకమ్మ బావి కందికల్ గేట్ -గౌలిపురా, వైశాలి నగర్ -ఇస్సాదాన్, నర్సా బైకుంట- మైలార్‌దేవులపల్లి, సంజీవిని హిల్స్, మూసీ నది పక్కన, ఉప్పర్ పల్లి లల్లో ఏర్పాటు చేశారు.

**శాశ్వత బేబీ పాండ్లు..**

**ఎల్.బి.నగర్ జోన్-**

చర్లపల్లి చెరువు, కాప్రా చెరువు, నల్ల చెరువు, నాగోల్ చెరువు, మన్సూరాబాద్ పెద్ద చెరువు, చార్మినార్ జోన్-లో,పాతి కుంట, రాజన్న బావి, ఖైరతాబాద్ జోన్‌లో నెక్నాంపూర్, నెక్లెస్ రోడ్, దుర్గం చెరువు, మల్కం చెరువు, నల్లగండ్ల చెరువు, గోపి చెరువు,

**శేరిలింగంపల్లి జోన్ –** గంగారం చెరువు, కైదమ్మ కుంట, గురునాథం చెరువు, రాయ సముద్రం, కూకట్ పల్లి జోన్-ముల్కత్వ చెరువు, ఐడీఎల్ బేబీ పాండ్, బాలాజీ నగర్, మూసాపేట్, బోయిన్ చెరువు, ప్రగతి నగర్, ఆల్విన్ కాలనీ, హైదర్‌నగర్, వెన్నెల గడ చెరువు, లింగం చెరువు, సురారం (మైసమ్మ దేవాలయం పక్కన), కొత్త చెరువు, అల్వాల్ దేవాలయం

**సికింద్రాబాద్ జోన్-**

సంజీవయ్య పార్క్, సఫిల్‌గూడ, బండ చెరువులల్లో శాశ్వత బేబిపాండ్లు ఏర్పాటు చేశారు.

## అమీర్‌పేటలోని నెయ్యి దుకాణంలో అగ్నిప్రమాదం



**హైదరాబాద్, ఆగస్టు 28 ప్రభాతవార్త:**

అమీర్‌పేటలోని బాలాజీ నెయ్యి తయారీ దుకాణంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మంటలు భారీగా వ్యాపించాయి. పొగ దట్టంగా కమ్ముకుంది. సమాచారం అందుకున్న సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మూడు అగ్నిమాపక యంత్రాలతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దుకాణంలో భారీగా మంటలు ఎగసిపడడంతో పక్కనే ఉన్న ఎంబ్రాయిడరీ షాపులోకి మంటలు వ్యాపించి అందులోని వస్తువులు కాలిపోయాయి.

**పెట్రోల్ బంక్‌లో ఒక్కసారిగా మంటలు..**

బోయిన్‌పల్లి పరిధిలో బుధవారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ద్విచక్రవాహనంలో పెట్రోల్ పోస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడడం, పెట్రోల్ బంకు మెషిన్‌కు అంటుకోవడంతో అక్కడి సిబ్బంది,పెట్రోల్ కోసం వచ్చిన వినియోగదారులు భయాందోళనకు గురై బయటకు పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రాణాపాయం జరగపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకున్నారు.

## ప్రమాదాల నివారణకు చర్యలు

### -సిఎండి ముషరఫ్ ఫరూకీ



బస్తీ బాటలో పాల్గొన్న తెలంగాణ సదరన్ డిస్కం సిఎండీ ముషరఫ్ ఫరూకీ

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** తెలంగాణ సదరన్ డిస్కం సిఎండీ ముషరఫ్ ఫరూకీ బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా వైట్‌ఫీల్డ్ సెక్షన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్ వడ్డెర బస్తీని సందర్శించారు. స్థానిక ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి విద్యుత్ సంబంధిత సమస్యలను ఆరాతీశారు. విద్యుత్ ప్రమాదాల నివారణకుగాను అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి వారికి మెరుగైన సౌకర్యాలను కల్పిస్తున్నట్లు సీఎండీ తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం వహించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. వర్షాకాలంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు ఏర్పడకుండా పలు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్ నర్సింలు, సిఇ పాండ్యా నాయక్, ఎస్ఇ చంద్ర శేఖర్, డిఇ శ్యాంకుమార్, ఎడిఇ కమలాకర్, ఏఈ కిషోర్ పాల్గొన్నారు.

### శ్రీనివాస్ నగర్ కాలనీ పార్కును సందర్శించిన కమిషనర్



అధికారులతో కలిసి పర్యటిస్తున్న కమిషనర్

**నిజాంపేట్, ఆగస్టు 28, ప్రభాతవార్త**

నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ గురువారం శ్రీనివాస్ నగర్ కాలనీ పార్కును సందర్శించారు. వాకింగ్ ట్రాక్, లైటింగ్ కోసం 50 లక్షల రూపాయలు సాంక్షన్ చేయించడం జరిగిందన్నారు. వచ్చే నెలలో పనులు ప్రారంభం చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వసంత, డివిజన్ ఇంచార్జ్ అఖిల్, బిజెపి మల్కాజిగిరి పార్లమెంట్ మీడియా కన్వీనర్ సుమన్ రావు తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా అడిషనల్ కలెక్టర్‌ని కలిసిన కొలన్ హన్మంత్ రెడ్డి



అడిషనల్ కలెక్టర్‌కి వినతిపత్రం అందజేస్తున్న కొలన్ హన్మంత్ రెడ్డి

**నిజాంపేట్, ఆగస్టు 28, ప్రభాతవార్త**

నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అడిషనల్ కలెక్టర్‌ని కలిసారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 20, 21, 22, 23 డివిజన్లలో శ్రీ సాయి నగర్, దేవేందర్ నగర్, ఆదిత్య కాలనీ, బాచుపల్లి డబల్ బెడ్ రూమ్స్, రామకృష్ణ ఎంక్లేవ్, వాసవి లేఔట్, ప్రశాంతి గోల్డెన్ హిల్స్ స్మశాన వాటిక కొరకు అలాగే పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి అతిత్వరలో వారి సమస్యని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డివిజన్ నాయకులు, సీనియర్ నాయకులు, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

### కరెంట్ స్తంబానికి ఢీకొని యువకుడు మృతి

**జీడిమెట్ల, ఆగస్టు 28, ప్రభాతవార్త**

కరెంట్ పోలుకు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గొర్లి సాయికుమార్ (22) ఓ ప్రైవేట్ కంపెనీలో సీఎన్సీ ఆపరేటర్‌గా పనిచేస్తూ, అక్కడే రూంలో నివాసం ఉంటున్నాడు. కాగా బుధవారం రాత్రి సుమారు 11 గంటలకు గణేష్‌లను చూడడానికి వెళుతున్నానని తనతోపాటు రూమ్‌లో ఉన్న వారితో చెప్పి బైక్ టీజి08 4996 ఎన్ఎస్ 160 పల్సర్‌పై బయలుదేరాడు. కాగా గురువారం ఉదయం 7:18 గంటలకు జీడిమెట్ల డిపో దగ్గర, పల్లవి పార్క్ క్రాస్ రోడ్ దగ్గర పోల్‌కు ఢీ కొట్టగా, నుదిటికి బలమైన గాయం తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## ప్రమాదవశాత్తు దీపం కిందపడి చెలరేగిన మంటలు..

### -సర్టిఫికెట్స్, వస్తువులు బూడిదపాలు

**నిజాంపేట్, ఆగస్టు 28, ప్రభాతవార్త**

గణపతి పూజా దీపం కిందపడి మంటలు చెలరేగిన సంఘటన నిజాంపేట్ రాజీవ్ గృహకల్పలోని ఓ ఇంట్లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం నిజాంపేట్ కార్పొరేషన్ లోని రాజీవ్ గృహకల్ప బ్లాక్ నెంబర్ 60 డోర్ నెంబర్ 2 లో సిరిగిరి రాజు, సిరిగిరి జోష్నా గత పదేళ్లుగా నివాసం ఉంటున్నారు. బుధవారం వినాయక చవితిని పురస్కరించుకొని తమ ఇంట్లో గణపతిని ప్రతిష్ఠించి పూజలు అనంతరం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. కాగా వినాయక పూజలో వినియోగించిన దీపం ప్రమాదవశాత్తు కిందపడి మంటలు చెలరేగి ఇంట్లోని వస్తువులంతా కాలి బూడిద అయ్యాయి. పక్కింటి వాళ్ల గమనించి మీ ఇంట్లో పొగలు వస్తున్నాయని రాజు, జోష్ణ దంపతులకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో వచ్చి చూడగా ఇల్లంతా కాలుతూ కనిపించింది. చుట్టు పక్కల వారు నీళ్లతో మంటలు ఆర్పి పరిశీలించగా మంటల్లో కేజీ నుండి పీజీ వరకు చదివిన సర్టిఫికెట్స్, నగదు కాలి బూడిద అయ్యాయి. అలాగే తమ ఇంట్లో ఏడు తులాల బంగారం ఉన్నదని, అదికూడా ప్రస్తుతం కనిపించడం లేదని ఆ దంపతులు తెలిపారు

### గణనాధులకు ఉచిత లడ్డూల పంపిణీ

**మెహిదీపట్నం, ఆగస్టు 28, ప్రభాతవార్త :** గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని కార్వాన్ నియోజకవర్గంలోని గణనాధులకు బిజెపి గోల్కొండ జిల్లా కౌన్సిల్ సభ్యులు గంజి రఘునాథ్ ఆధ్వర్యంలో లడ్డూలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా కార్వాన్ నియోజకవర్గంలోని గణనాధులకు ఉచితంగా లడ్డూలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. భక్తిశ్రద్ధలతో 1000 కిలోల మిశ్రమంతో ప్రత్యేకంగా తయారుచేసిన లడ్డూలను తయారు చేయడం జరుగుతుందన్నారు. ఈ లడ్డూలను కేజీ నుంచి 25 కేజీల వరకు విభిన్న పరిమాణాలతో తయారు చేస్తున్నామన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా హిందూ భక్తులందరూ గణేష్ మండపాల వద్ద నీటి వసతిని ఏర్పాటు చేసి శుభ్రం చేసుకున్న తర్వాతనే గణనాధునికి పూజలు చేయడంతో పాటు నవరాత్రులపాటు భక్తులు మెడలు కాషాయ కండువాను ధరించాలని కోరారు.



వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బాల వీర్ భక్త సమాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద జరిగిన వినాయక ప్రతిమకు టిపిసిసి లింగ్విస్టిక్ మైనార్టీసెల్ యూత్‌చైర్మన్ మురళీమోహన్ సింగ్ ప్రత్యేక పూజలు చేశారు.



రాష్ట్ర కురుమ సంఘం భవన్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలోకురుమ సంఘం రాష్ట్ర నాయకులు కట్టమల్లేశం కురుమ పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు.



బోయిన్‌పల్లి పీఎస్ సమీపంలోని వినాయక మండపంలో పూజలు చేస్తున్న జంపనప్రతాప్, ఏసిపి గోపాల క్రిష్ణమూర్తి, సిఐ తిరుపతి రాజు తదితరులు



బోయిన్‌పల్లిలో పూజలు చేస్తున్న కాంగ్రెస్ నేత ముప్పిడి మధుకర్ తదితరులు



గాయిత్రినగర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు.



గణేష్ పూజలో పాల్గొన్న న్యాయవాదులు



గణేష్ మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్



గణపతి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బండి రమేష్



ఎస్పీరోడ్డు శ్రీవీరహనుమాన్ ఆలయంలో గణనాధుడు.



కాచిగూడ చెప్పల్‌బజార్‌లో గణేష్ మండపంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, చిత్రంలో అడిషనల్ డిసిపి నర్సయ్య, కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్



అంబర్‌పేటలో భారీ వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న వి.హనుమంతరావు, చిత్రంలో శంభుల శ్రీకాంత్‌గౌడ్ దంపతులు



ఖానాపూర్ గ్రామంలో ప్రతిష్టించిన వినాయకుడికి పూజలు చేస్తున్న గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేష్ ముదిరాజ్ తదితరుల దృశ్యం



లెజెండ్ ఫైమ్స్ గేటెడ్ కమ్యూనిటీలో గణపయ్యకు పూజలు చేస్తున్న అధ్యక్షులు పి.చంద్రశేకర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి అలివేలు మంగ తదితరులు.



మణికొండలో ఏర్పాటు చేసిన లంబోదరుడి పూజల్లో పాల్గొన్న నాయకులు సాయిరెడ్డి, శ్రీరాములు, కుమార్ తదితరుల దృశ్యం.



ఆర్టీసిక్రాస్‌రోడ్స్ లక్ష్మీగణపతి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, చిత్రంలో ఆలయం చైర్మన్ మారిశెట్టి నర్సింగరావు తదితరులు



వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు

# వాడవాడలా వైభవంగా పూజలందుకుంటున్న వినాయకుడు

### బిసి రిజర్వేషన్లను అడ్డుకుంటున్న బిజెపి : టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 28 ప్రభాతవార్త:** విద్యా ఉద్యోగ స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 42 శాతం బీసీ రిజర్వేషన్లను బిజెపి అడ్డుకుంటుందని టీపీసీసీ అధ్యక్షుడు,ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. బిజెపికి దమ్ముంటే వెంటనే పార్లమెంటు సమావేశాలు నిర్వహించి బీసీ బిల్లును ఆమోదించాలని, అందుకు ఇండియా కూటమి పూర్తి మద్దతిస్తుందని ఆయన స్పష్టం చేశారు. వినాయక చవితి సందర్భంగా గాంధీభవన్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శిలు నాగభూషణం. కొమరయ్య, ఉపాధ్యక్షుడు సురేష్, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్, శ్రీనివాస్‌గౌడులు గురువారం మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్లలో 10 శాతం ముస్లింలకు రిజర్వేషన్లని బిజెపి తప్పుడు ప్రచారం చేస్తుందన్నారు. నెల రోజులపాటు పార్లమెంటు సమావేశాలు జరిగితే రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు జి కిషన్‌రెడ్డి, బండి సంజయ్, మిగతా బీజేపీ ఎంపీలు ప్రధానిని కలిసి 42 శాతం బీసీ రిజర్వేషన్ల అంశాల్ని ఎందుకు ప్రస్తావించలేదని ఆయన ప్రశ్నించారు. బిజెపి నేతలకు బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేదని ఆయన ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవడానికి బిజెపి రకరకాల కుట్రలు చేస్తుందని ఆయన ధ్వజమెత్తారు. ప్రస్తుతం బీసీ రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి వద్ద ఉందని వెంటనే ఆమోదించి బీసీలకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్లకు కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్న బిజెపికి బీసీలు సరైన రీతిలో గుణపాఠం చెబుతారని బిజెపి, బీఆర్ఎస్ పార్టీలను వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బొంద పెడతారని ఆయన హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలని విజయమే లక్ష్యంగా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వినాయక నవరాత్రి వేడుకలు ప్రశాంతంగా ముగియడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు మండప నిర్వాహకులు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు.



పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు వినాయక చవితి శుభాకాంక్షలు తెలుపుతున్న పిసిసి నేతలు నాగభూషణం, కొమురయ్య, తొలుపునూరి కృష్ణగౌడ్ తదితరులు

### టెక్‌మహీంద్రా ఎదుట ఎబివిపి ఆందోళన

**దుండిగల్, ఆగస్టు 28 ప్రభాతవార్త :** విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడుతుంటే నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్న టెక్‌మహీంద్రా యూనివర్సిటి అనుమతులు రద్దు చేయాలని అఖిల భారతీయ విద్యా పరిషత్(ఎబివిపి) నాయకులు డిమాండ్ చేశారు. ఇటీవల ఈగల్ టీమ్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా యూనివర్సిటిలో మత్తు పదార్థాలు లభించడం, విద్యార్థులకు పాజిటివ్ వచ్చిన నేపథ్యంలో మేడ్చల్ జిల్లా ఎబివిపి సంఘం నాయకులు గురువారం యునివర్సిటి ఎదుట అందోళన చేశారు. ఈసందర్భంగా కన్వీనర్ నగేష్ మాట్లాడుతూ టెక్‌మహీంద్రా నిర్వాహకులు లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులపై ఎలాంటి పర్యవేక్షణ లేకుండా వారి భవిష్యత్తును కాలారాస్తున్నట్లు పేర్కొన్నారు. ఘటన జరిగి మూడు రోజులు గడుస్తున్న యూనివర్సిటి విసి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలుగా మారడం, యూనివర్సిటిలోనే మత్తు పదార్థాలు తీసుకుంటుంటే నిర్వాహకులు ఏం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జోక్యం చేసుకొని యూనివర్సిటి అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటిల్లో ఈగల్ టీమ్‌లు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తే అనేకంగా వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

## డిజిటల్ అరెస్ట్ పేరిట సైబర్ మోసం

### బాధితుడి ఖాతా నుంచి రూ. 33.40 లక్షలు కాజేసిన నేరగాళ్లు

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త పద్ధతిలో ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తూ వారి ఖాతాలు లూటీ చేస్తున్నారు. తాజాగా మానవ అక్రమ రవాణా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నావంటూ నగరానికి చెందిన ఓ వృద్ధుడితో పాటు అతడి భార్యను భయబ్రాంతులకు గురిచేసి వారి ఖాతాలో ఉన్న రూ. 33.40 లక్షలను కాజేశారు. వివరాల్లోకి వెళ్తే.. బోయిన్‌పల్లికి చెందిన వృద్ధుడు(75)కి సైబర్ నేరగాళ్ల ఫోన్ చేసి, కర్ణాటక రాష్ట్రానికి చెందిన క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ గౌరవ్ సారథిగా పరిచయం చేసుకున్నాడు. మానవ అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన క్రిమినల్ కేసులో బాధితుడి ఆధార్ కార్డు దుర్వినియోగం చేయబడిందని ఆరోపించారు. అనంతరం వృద్ధుడిపై కేసు నమదైనట్లు సంబంధిత నకిలీ పత్రాలను చూపించారు. జాతీయ రహస్యాల చట్టం, 1923 ప్రకారం కేసు నమోదైనట్లు వివరిస్తూ బాధితుడితో పాటు అతడి భార్యను డిజిటల్ అరెస్ట్ చేశామంటూ భయబ్రాంతులకు గురిచేశారు. విచారణ ప్రక్రియ నిమిత్తం తమ పై అధికారితో మాట్లాడాలని సూచించాడు. అనంతరం ఐపీఎస్ అధికారి దయా నాయక్ పేరుతో మరో వ్యక్తి కాల్ చేసి బాధితుల వివరాలపై ఆరా తీశాడు. అయితే, ఈ కేసులో మీ ప్రమేయం లేకుంటే విచారణకు పూర్తిగా సహకరించాలని, ఇందుకోసం మీ బ్యాంకు ఖాతా తదితర వివరాలను చెప్పాలని హెచ్చరించారు. విచారణలో భాగంగా మొదటగా వృద్ధుడి బ్యాంకు ఖాతాలో ఉన్న రూ. 15 లక్షలు పంపాలని ఒత్తిడి చేశారు. విచారణ పూర్తయిన తర్వాత డబ్బులు తిరిగి చెల్లిస్తామని నమ్మించి వివిధ కారణాలతో మొత్తం రూ. 33.40 లక్షలు కాజేశారు. అనంతరం సైబర్ నేరగాళ్ల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంత మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### తెలంగాణ ప్రభుత్వ పుస్తక ముద్రణాలయం సర్వీస్ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సిరిగిరి కిరణ్



సిరిగిరి కిరణ్‌ను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, ఆగస్టు 28 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వ పుస్తక ముద్రణాలయం సర్వీసరీ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సిరిగిరి కిరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జరిగిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు సిరిగిరి కిరణ్ నియామకాన్ని ధ్రువీకరించారు. ఈ సందర్భంగా సిరిగిరి కిరణ్ మాట్లాడుతూ ఉద్యోగులకు సంబందించిన అన్ని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటిని సర్వరమే పరిష్కరించే విధంగా తన వంతు కృషి చేస్తానని అన్నారు. తనపై నమ్మకంతో అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా నియమించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన సిరిగిరి కిరణ్ లను అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏ.ప్రవీణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ జగన్నాథ రావు,చీఫ్ అడ్వైసర్ కె.విజయ్ కుమార్, తెలంగాణ ప్రభుత్వ పుస్తక ముద్రణాలయం అసిస్టెంట్ డైరెక్టర్ సంతోష్ కుమార్, కోశాధికారి కె.సుబ్బా రెడ్డి, వై. రాజు, కార్యాలయ కార్యదర్శులు పి.పండరి, బి.శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి ఎస్.సునీత తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లో వ్యక్తి ఆత్మహత్య

**చిక్కడపల్లి, ఆగస్టు 28 ప్రభాతవార్త:** ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం మల్కిపురం గ్రామానికి చెందిన పవన్(25) బ్రతకుదెరువు కోసం పొట్టచేతపట్టుకుని హైదరాబాద్ నగరానికి జీవన ఉపాధి కోసం వలస వచ్చాడు. నగరంలోని ఆర్టీసిక్రాస్ రోడ్స్ లో వింటేజ్ బార్ పక్కన ఉన్న భవనం యాజమాని రాకేశ్ రెడ్డి వద్ద డ్రైవర్‌గా గత సంవత్సరం కాలం నుంచి పనిచేస్తున్నాడు. యజమాని ఉంటున్న భవనం మూడవ అంతస్తులో ఓ గదిలో నివాసం ఉంటున్నాడు. బుధవారం యజమాని డ్రైవర్ పవన్‌కు ఫోన్ చేయగా అతడు ఎంతకూ లిఫ్ట్ చేయలేదు. కాగా భవనం మరమ్మత్తుల పనులు జరుగుతున్న నేపథ్యంలో కార్మికులు పవన్ ఉన్న రూంలో దుర్వాసన వస్తోందని యజమానికి సమాచారం అందించాడు. వెంటనే భవన యజమానులు చిక్కడపల్లి పోలీసులు సమాచారం అందించగా వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని తలుపులు బద్దలుకొట్టి చూడగా పవన్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉండడం కనిపించింది. స్థానిక పోలీసులు పూర్తి వివరాలు సేకరించి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కాగా పవన్ పెద్ద అన్న నగరంలోని కూకట్‌పల్లిలో నివాసముంటున్న అతడికి స మాచారం అందించారు. కాగా పవన్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. కేసును ఎస్సై మోనిక దర్యాప్తు చేస్తున్నారు.

### అక్రమ నిర్మాణాలపై చర్యలు

**దుండిగల్, ఆగస్టు 28 ప్రభాతవార్త:** దుండిగల్ పురపాలిక పరిధిలో అనుమతుల్లేకుండా, నిబంధనలు అతిక్రమించి చేపడుతున్న పలు నిర్మాణాలపై గురువారం టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. 10వ వార్డులో అనుమతుల్లేకుండా చేపడుతున్న షెడ్డు నిర్మాణం, బాలానగర్–నర్సాపూర్ ప్రధాన రహదారి పక్కన నిబంధనలు అతిక్రమించిన నిర్మాణంలో కూల్చివేతలు చేశారు. ఈసందర్భంగా టిపివో సంజున మాట్లాడుతూ నిబంధనలకు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

### అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తాం



విద్యుత్ అమర వీరులకు నివాళులు అర్పిస్తున్న వామపక్షాల నేతలు

**సైఫాబాద్, ఆగస్టు 28 ప్రభాతవార్త:** విద్యుత్ ఉద్యమ అమర వీరుల త్యాగాల స్ఫూర్తితో రానున్న రోజుల్లో ప్రజా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని వామపక్ష పార్టీల నాయకులు హెచ్చరించారు. విద్యుత్ అమర వీరుల 25వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం బషీర్‌బాగ్ చౌరస్తాలో అమర వీరుల స్థూపం వద్ద సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్యపద్మ, సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహ్మ, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, వామ పక్షాల నాయకులు గాదగోని రవి, సి.హెచ్.మురహరి, డిజి నర్సింగ్‌రావు తదతరులు ప్రసంగించారు. తేమర వీరులకు నివాళులు అరిర్పంచిన వారిలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, వామపక్షాల నాయకులు వి.ఎస్.బోస్, ఎస్.ఛాయాదేవి, ఎస్.వీరయ్య, ఝాన్సీ, ఎస్.ఎల్.పద్మ, జ్యోతి, అన్వేష్, గోవర్ధన్, అరుణ పాల్గొన్నారు.

### గణేష్ నిమజ్జనం ఘాట్స్ పనులను పరిశీలించిన కమిషనర్, సిఐ

**కొంపల్లి, ఆగస్టు 28, ప్రభాతవార్త**

నిజాంపేటలోని శ్రీరాములకుంట, పాపయ్య కుంట, బాచుపల్లిలోని పెద్ద చెరువు వద్ద జరుగుతున్న గణేష్ నిమజ్జనం ఘాట్స్ పనులను గురువారం కమిషనర్ సాబీర్ అలీ, బాచుపల్లి సిఐ సతీష్ కుమార్ గణేష్ ఉత్సవ సమితితో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లు, క్రమబద్ధీకరణ పనులను వారు సమీక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రశాంత వాతావరణంలో గణేశ్ నిమజ్జనం పూర్తి చేయాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ సమితి నిజాంపేట్ కార్పొరేషన్ కన్వీనర్ మందపాటి శ్రీధర్ రెడ్డి, స్థానిక నాయకులు నరేంద్ర చౌదరి, బిక్షపతి యాదవ్, సుమన్ రావు, రవి యాదవ్, సచిన్, సంతోష్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

### నవరాత్రి వేడుకలను అధ్యాత్మిక భావనతో జరుపుకోవాలి

### : డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 28 ప్రభాతవార్త:** వినాయక నవరాత్రి వేడుకలను భక్తి శ్రద్ధలతో, అధ్యాత్మిక భావనతో జరుపుకోవాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిది,వెంగళరావునగర్‌కాలనీ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ చెర్మన్ డాక్టర్ పి.వి.రవిశేఖర్ రెడ్డి అన్నారు. వినాయక చవితి బుధవారం ఉదయం సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యములో జరిగిన కార్యక్రమములో మట్టి గణపతులు,మొక్కలను ఆయన ఉచితంగా పంపిణీ చేశారు.ఈ సందర్భముగా డాక్టర్ రవిశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మట్టి విగ్రహాలను నీటి బకెట్ లో నిమజ్జనం చేసి ఆ నీటిని చెట్లకు పోయలని సూచించారు. రేపటి స్వేచ్ఛా వాతావరణాన్ని మన జాగ్రత్తలతో నిర్మిద్దామని, రసాయన పరమైన కాలుష్య భూతాన్ని నిషేధిద్దామని పిలుపునిచ్చారు.అందుకే మట్టి గణపతులతో పాటు చెట్లను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమములో వెంగళరావునగర్ కాలనీ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.రంగారావు, వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ టి.వి.రెడ్డి,ట్రెజరర్ న్యాయవాది లక్ష్మీకాంతరావు, నాగరాజు, గురునాథ రావు, కాలనీ సీనియర్ సిటిజెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వినాయకసాగర్‌లోనే 6వ తేదిన నిమజ్జనం

-పోలీసులు సహకరించాలి




ఉత్సవ సమితి ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యాలయంలో పూజలు చేసిన అనంతరం మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ,ఉత్సవ సమితి ప్రతినిధులు పోస్టర్ ఆవిష్కరణ చేసిన దృశ్యం

**గోషామహల్,ఆగస్టు 28 ప్రభాతవార్త:** వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆద్వర్యంలో సిద్ది బర్‌బజార్‌లోని బహెతిభవన్‌లో వినాయక పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.ఈపూజ కార్యక్రమంలో మాజీ గవర్నర్ దత్తాత్రేయ,ఉత్సవ సమితి అధ్యక్షులు జి.రాఘవరెడ్డి,ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవినూత శశిధర్,సలహాదారులునర్సింగ్‌పూరియా,మాజీ కార్పొరేటర్ ఉపాధ్యక్షులు మెట్టువైకుంఠం, రామరాజు ,కె.మహేందర్, గోవింద్‌రాఠి,శ్రీరామ్‌వ్యాస్,ఉత్సవ సమితి ప్రతినిధులతో పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ హిందువులలో వస్తున్న ఐక్యత,ధర్మ రక్షణ కోసం ఉపయోగపడాలని అందుకై ప్రతి హిందువు కంకణ బద్దులై పని చేయాలని పిలుపునిచ్చారు.ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవినూతల శశిధర్ మాట్లాడుతూ వచ్చే నెల 6వ తేదిన వినాయక సాగర్‌లోనే నిమజ్జన కొనసాగుతుందన్నారు.ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పూర్తి ఏర్పాట్లు చేయాలన్నారు.స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలన్నారు.విదేశీ వస్తువులను బహిష్కరించాలన్నారు.ఈ కార్యక్రమంలో 24 నియోజకవర్గాల గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు తదితరులు విశ్వహింద్‌పరిషత్ ,భజరంగ్‌దళ్ పాల్గొన్నారు.

### విఘ్నేశ్వరున్ని వేడుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయి : మంత్రి పొన్నం ప్రభాకర్



మారేడ్‌పల్లి సిద్ది వినాయక ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్,ఆగస్టు 28 ప్రభాతవార్త:** విఘ్నేశ్వరున్ని వేడుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వినాయక చవితిని పురస్కరించుకొని వెస్ట్ మారేడ్‌పల్లిలోని సిద్ది వినాయక ఆలయంలో నిర్వహించిన వేడుకల్లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు వారికి శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

## హెచ్‌పిఎస్ స్కూల్‌కు రావాల్సిన నిధుల విడుదలకు సహకరిస్తా : ఎమ్మెల్యే శ్రీగణేష్



హెచ్‌పిఎస్ విద్యార్థుల ఫేరెన్స్‌తో సమావేశమైన ఎమ్మెల్యే శ్రీగణేష్

**అడ్డగుట్ట,ఆగస్టు 28 ప్రభాతవార్త:** హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ హెచ్‌పిఎస్‌లో చదువుతున్న ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను తక్షణమే విడుదల చేసేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తెచ్చి సమస్య పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ హామీ ఇచ్చారు. గురువారం తుకారాంగేట్‌లోని ఆయన నివాసంలో హెచ్‌పిఎస్‌లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో ఆయన సమావేశమైయ్యారు. 2025. .25 విద్యా సంవత్సరంలో 64 మందికి అడ్మిషన్లు ఇచ్చారని, అందుకు ఫీజు బకాయిలు రూ.18 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అదే విధంగా స్టేషనరీ బకాయిలు రూ.21 లక్షలు, స్కాలర్‌షిప్ బకాయిలు రూ.10 లక్షల నిధులకు సహకరించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్కతో చర్చించి నిధులు విడుదల అయ్యే విధంగా కృషి చేస్తామన్నారు.

## విద్యార్థినిపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలి : ఎస్.ఎఫ్.ఐ.డిమాండ్



మారేడ్‌పల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఆందోళన చేస్తున్న ఎస్.ఎఫ్.ఐ. విద్యార్థులు

**కంటోన్మెంట్,ఆగస్టు 28 ప్రభాతవార్త:** సికింద్రాబాద్, మారేడ్‌పల్లిలోని ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న ఓ బాలికను సూపరిండెంట్ అసభ్యకరంగా ప్రవర్తించాడని, అందుకు అయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎస్.ఎఫ్.ఐ. విద్యార్థులు ప్రిన్సిపాల్ వినోద్ కుమార్‌తో వాగ్వివాదానికి దిగారు. విషయం తెలుసుకున్న తుకారాంగేట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పర్యవేక్షించారు. పాలిటెక్నిక్ కళాశాలలో సూపరిండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సుధాకర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న విద్యార్థినిపై ఈ నెల 10వ తేదీన అసభ్యకరంగా ప్రవర్తించడాని అ బాలిక తల్లిదండ్రులు 11న ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారని తెలిపారు. అతనిపై ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో ఎస్.ఎఫ్.ఐ.విద్యార్థులు అందోళనకు దిగారు. ఈ సందర్భంగా తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మైనర్ బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన సదరు వ్యక్తిపై ఫోక్స్ చట్టం కింద కేసు నమోదు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇప్పటి వరకు తమకు లిఖిత పూర్వకంగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ.నగర కార్యదర్శి కె.అశోక్‌రెడ్డి, నాయకులు అంజనేయులు, కార్తీక్, ప్రవీణ్,స్టాలిన్,విఘ్నేష్,లెనిన్‌లు పాల్గొన్నారు.

## తలసాని స్కైలాబ్ యాదవ్ కుమారుడిపై దాడి

**కంటోన్మెంట్,ఆగస్టు 28 ప్రభాతవార్త:** గణేష్ మండపాల్లో పూజలు నిర్వహించేందుకు వెళ్తున్న మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తమ్ముడు స్కైలాబ్ యాదవ్ కుమారుడిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన సంఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు తెలిపిన వివరాల ప్రకారం మోండా మార్కెట్ ప్రాంతానికి చెందిన తలసాని యువంత్ యాదవ్, అతని స్నేహితుడు వంశీ,మనీష్‌లు ఈ నెల 27న రాత్రి బోయిన్‌పల్లిలోని పలు గణేష్ మండపాల్లో జరిగే పూజా వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చారు. హస్మత్ పేట్ నుంచి సికింద్రాబాద్‌కు కారులో వెళ్తుండగా అంబేద్కర్ విగ్రహం వద్ద ఫయాజ్,రియాజ్,బబ్లూలతో పాటు మరి కొందరు కలిసి వారి కారును పోనివ్వకుండా అడ్డుపడ్డారు. దీంతో కారు దిగి వారికి దారి ఇవ్వాలని కోరడంతో మాటా మాటా పెరిగి యువంత్ యాదవ్, వంశీలపై దాడి చేశారు. దీంతో వారి మెడలో ఉన్న గోల్డ్ చైన్ కూడా పోయింది. బాధితుల ఫిర్యాదు మేరకు బోయిన్‌పల్లి పోలీస్‌లు కేసు నమోదు చేసుకొని ఎస్ఐ శివశంకర్ దర్యాప్తు చేస్తున్నారు.

## చేప పిల్లల బిల్లులు చెల్లించాలని మత్స్య భవన్ ముందు చేప రైతుల అర్ధనగ్న ఆందోళన



మాసబ్ ట్యాంక్‌లోనీ మత్స్య భవన్ ముందు చేప రైతుల అర్ధనగ్న ఆందోళన

**మెహిదీపట్నం, ఆగస్టు 28, ప్రభాతవార్త :** గత రెండు సంవత్సరాలుగా చేప పిల్లల బిల్లులు చెల్లించకపోవడంతో మత్స్య రైతుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని తెలంగాణ మత్స్య రైతుల ఉత్పత్తి అసోసియేషన్ అధ్యక్షులు గుర్రాల మల్లేశం ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ లో ఉన్నటువంటి చేప పిల్లల బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ గురువారం తెలంగాణ మత్స్య రైతుల ఉత్పత్తి అసోసియేషన్ ఆధ్వర్యంలో మాసబ్ ట్యాంక్ లోని మత్స్య భవన్ వద్ద చేప రైతులు అర్ధనగ్న ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా గుర్రాల మల్లేశం మాట్లాడుతూ....గత రెండు సంవత్సరాలుగా తాము సరఫరా చేసిన చేపల బిల్లులు చెల్లించకపోవడంతోతీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నా రు. బిల్లులు చెల్లించకపోవడంతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం చేప పిల్లల బిల్లులను ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.75 కోట్లు, 2024-25 సంవత్సరంలో మరో రూ.34 కోట్లు బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా రైతులకు చెల్లించకపోతే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయన్నారు. చేపల ఉత్పత్తిలో తెలంగాణకు జాతీయ స్థాయిలో అవార్డు వచ్చినా, ఆ చేపల పంపిణీ చేసిన రైతులు మాత్రం బిల్లులు చెల్లించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి చేప పిల్లల బకాయిలను వెంటనే చెల్లించాలని,లేకుంటే తమ కుటుంబాలతో మత్స్య భవన్ ముందు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ధర్నాలో మత్స్య రైతులు పాల్గొన్నారు.

## ఎన్ఆర్ఆర్‌పురం హౌసింగ్ సొసైటీలో అనర్హులను తొలగించాలి

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 28, ప్రభాతవార్త :** బోరబండ ఎన్ఆర్ఆర్‌పురం నూకల రామచంద్రారెడ్డి పురం కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి చెందిన కమిటీ రద్దు చేయాలని సొసైటీలోని అర్హులైన సభ్యులు డిమాండ్ చేశారు. ఇందుకు గాను ఇప్పటికే కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కమిషనర్‌కు హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వివేక్ వెంకటస్వామిని కోరటం జరిగిందని సొసైటీ మాజీ అధ్యక్షులు ఎమ్ఏ సత్తార్ పేర్కొన్నారు. సొసైటీ 1976లో ఏర్పడటం జరిగిందని ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల కోసం దాదాపు 61 ఎకరాల 21 కుంటల స్థలంలో మొత్తం 1807 అందులో 1407 ఇళ్లు నిర్మించారని 400 ఓపెన్ ప్లాట్లు ఉన్నాయని అయితే ఎవరికైతే అలాట్ అయ్యిందో వాళ్లే ఆ ఇళ్లలో ఉండాలని కొందరు అమ్ముకుని వెళ్లడంతో అలాంటి వారిని థర్డ్ పార్టీగా సొసైటీ గుర్తించిందన్నారు. థర్డ్ పార్టీ వారికి సభ్యత్వం ఇచ్చినప్పటికి వాళ్లు ఓటు హక్కు వినియోగించుకోవడానికి వీలు ఉండకపోయినా సొసైటీ ఎన్నికల్లో పేర్లు నమోదు చేసుకోవడంతో వాళ్లు కమిటీలో చలామనిగా ఉన్నారన్నారు. ఈ విషయాలపై 2003 సంవత్సరంలోనే ఫిర్యాదు చేసినప్పటికి వాళ్లు పట్టించుకోకపోవడంతో నిజమైన సభ్యులకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రస్తుతం సంవత్సరం క్రితం ఎన్నికైన 11 మంది సభ్యులలో ప్రస్తుత అధ్యక్షులు షేక్ యూసుఫ్‌ఉద్దీన్, ఉపాధ్యక్షులు ఈలయ్య, ఇమామ్‌గౌరీ, ఎండీ అబ్దుల్ రహమాన్, అక్తార్ సుల్తాన్, రామ్మోహన్, సాయినాథరావులు థర్డ్ పార్టీలో ఉండి సొసైటీలో కొనసాగుతున్నారని అన్నారు. అయితే ఈ కమిటీని వెంటనే రద్దు చేసి అర్హులైన సభ్యులకు సొసైటీలో కమిటీ సభ్యులుగా అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ సెక్రటరీ డి.మల్లయ్య, మాజీ డైరెక్టర్ సిద్దిక్, హనుమంతరావు, రమేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### విద్యా వెంకట్‌ను పరామర్శించిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

**కెపిహెచ్బి కాలనీ, ఆగస్టు 28, ప్రభాతవార్త**

సీనియర్ పాత్రికేయులు విద్యా వెంకట్‌ను మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ బుధవారం కూకట్‌పల్లిలోని రాందేవ్‌రావు ఆసుపత్రిలో పరామర్శించారు. గత పది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విద్యా వెంకట్ రాందేవ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి ఆసుపత్రిలో కలిసి పరామర్శించి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి వర్గాలు మెరుగైన వైద్య సౌకర్యం అందించి త్వరగా కోలుకునే విధం గా చూడాలని డాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో సీని యర్ పాత్రికేయులు దయాసాగర్, స్థానిక నాయకులు దుం బాల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

### ముఖ్యమంత్రి వ్యక్తిగత సహాయకుడు జయపాల్ రెడ్డిని పరామర్శించిన కాంగ్రెస్ శ్రేణులు

**కెపిహెచ్బి కాలనీ, ఆగస్టు 28, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వ్యక్తిగత సహాయకుడు జైపాల్‌రెడ్డి తండ్రి వెల్దండ రామచంద్రా రెడ్డి ఇటీవల పరమపదించారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని తిరుమలాపూర్ గ్రామంలో స్వగృహంలో జైపాల్ రెడ్డిని వారి కుటుంబ సభ్యులన తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యులు సంకేపల్లి సుధీర్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, టీపీసీసీ సెక్రటరీ గజ్జి భాస్కర్ తదితరులు కలిసి పరామర్శించారు. అనంతరం రామ చంద్రరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ ఈ దుఃఖ సమయంలో వారి కుటుంబానికి ఆ భగవంతుడు ధైర్యాన్ని, శాంతిని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నానని అన్నారు.

## పీజీ రోడ్డులో గుంతలు పూడ్చారు...



**బేగంపేట ఆగస్టు 28,ప్రభాతవార్త**

ఇటీవల నగరంలో కురుస్తున్న వర్షాలకు రోడ్లు దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి.గుంతల వల్ల ఆ మార్గంలో ప్రయాణం చేస్తున్న వాహన దారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.ఈ విషయాన్ని సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానికులు సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డా.కోట నీలిమ దృష్టికి తీసుకెళ్లారు. సమాచారాన్ని అధికారుల దృష్టికి తీసికెళ్లడంతో అధికారులు స్పందించి సోమవారం రాంగోపాల్‌పేట డివిజన్ పీజీరోడ్డు కృష్ణనగర్ కాలనీ రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చారు.ఈ సందర్భంగా త్రికాల మనోజ్‌కుమార్ డా.కోట నీలిమ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేసారు.

## విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు



**చార్మినార్. ఆగస్టు 28,ప్రభాతవార్త** పాతనగరంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు కలగకుండ అన్ని ఏర్పాట్లు చేశామని మెట్రో జోన్ చీఫ్ ఇంజినీరు కరుణాకర్ అన్నారు.గణేష్ ఉత్సవాలు సందర్భంగా ఆయన గురువారం పాతనగరంలో విద్యుత్ అధి కారులతో సమావేశమయ్యారు.ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ పాతబస్తీలో గణేష్ నవరాత్రి ఉత్సవాలకు విద్యుత్ సరఫరా లో ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకున్నామని తెలిపారు. రహదారులలోని క్రాస్ విద్యుత్ తీగలను తొలగించామని, ప్రధాన రహదారులలో యూజీ కేబులను ఏర్పాటు చేశామని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టీజీఎస్ పి డిసియల్ చార్మినార్ డీ ఈ యం.శ్రీధర్, చార్మినార్ ఎ డి ఈ మక్సూద్, మీరాలం ఏ డీ ఈ వెంకటేష్ గౌడ్ తో పాటు పలువురు పాల్గొన్నారు

## సీఎం చెక్కుల పంపిణీ చేసిన బండి రమేష్



**కెపిహెచ్బి కాలనీ, ఆగస్టు 28, ప్రభాతవార్త :** కూకట్పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ రాజు కాలనీకి చెందిన రాసమల్ల అనసూయ అనారోగ్యం కారణంగా నిమ్స్ హాస్పిటల్‌లో సర్జరీ చేయాలని సూచించడంతో వారి కుమారుడు రాజేందర్ కూకట్పల్లిలోని గొట్టుముక్కల వెంకటేశ్వర రావు కార్యాలయంలో సంప్రదించగా జీవిఆర్ బండి రమేష్ ద్వారా ముఖ్యమంత్రి సహానిధికి దరఖాస్తు చేయించడం జరిగింది. ప్రభుత్వ పెద్దల సహకారంతో వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నాలుగు రక్షల రూపాయలు మంజూరు అయ్యాయి. ఆ లెటర్‌ని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టిపిసిసి ఉపాధ్యక్షులు, కూకట్పల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ చేతుల మీదుగా వారి కుమారుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల వెంకటేశ్వర రావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ లక్ష్మయ్య, కొప్పిశెట్టి దినేష్, సాధు ప్రతాప్ రెడ్డి, గంధం రాజు, ఆకారం అనిల్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాధితులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, బండి రమేష్ కి, గొట్టుముక్కల వెంకటేశ్వర రావుకి కృతజ్ఞతలు తెలియజేశారు.

## గణేశ్ ఉత్సవ ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో జోనల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు



గణేశ్ ఉత్సవాల నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్,అధికారులు

**శేరిలింగంపల్లి, ఆగస్టు 28 ప్రభాతవార్త**

రానున్న గణేశ్ ఉత్సవాల నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లను ముందస్తుగా పూర్తిచేయాలని జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే అధికారులకు ఆదేశించారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని పలు ప్రాంతాలల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి శానిటేషన్ పరిస్థితిని, రోడ్ల స్థితిగతులను,చెరువులను తనిఖీ చేసిన జోనల్ కమిషనర్ హేమంత్ కిందిస్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. అగస్టు 27 వతేది నుంచి సెప్టెంబర్ 7వ తేది వరకు గణేశ్ ఉత్సవాలను పురస్కరించుకుని ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉత్సవాలు జరిగేలా ఆయా అధికారులు సమన్వయంతో ముందస్తు అన్ని ఏర్పాట్లను పూర్తిచేయాలని జోనల్ కమిషనర్ సూచించారు. పారిశుద్యనిర్వాహణ సజావుగా జరగాలని, ఏలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. క్షేత్రపరిధిల పారిశుద్య నిర్వాహణపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని శానిటేషన్ అధికారులకు సూచించారు. ఈ సందర్బంగా జోనల్ కమిషనర్ హేమంత్ దుర్గం చెరువు, మల్కం చెరువు, గోపిచెరువు, నల్లగండ్ల చెరువులను పరిశీలించారు. సాకి చెరువు వద్ద గల బేబి పాండ్‌ను గణేశ్ నిమజ్జనం కోసం సిద్దం చేయాలని తెలిపారు. గంగారం చెరువు చుట్టుపక్కల నివాసిత ప్రాంతాలల్లో డెంగ్యూ కేసులను గుర్తించటం జరిగిందని, నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలని ఎంటమాలజీ శాఖ అధికారులుకు ఆదేశించారు. ఎప్పటికప్పుడు నివేదికను ప్రధాన కార్యాలయం,జోనల్ కార్యాలయాలకు పంపాలని అధికారులకు తెలిపారు. గంగారం చెరువులో ఉన్న వాటర్ హైసిల్టింగ్‌ను యుద్ద ప్రాతిపదికన తొలగించాలని, చెరువు నుంచి తీసిన గుర్రపు డెక్క, తదితర వ్యర్థాలను ఎప్పటికప్పుడు ఎత్తివేయాలని, వారం రోజులు లోగా పనిపూర్తిచేయాలని సంబందిత అధికారులకు స్పష్టం చేశారు. డార్క్‌స్పాట్ వద్ద అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, వినాయక నిమజ్జనం సందర్భంగా విగ్రహాల ర్యాలీ కొనసాగేరహదారులను బాగుండేలా చర్యలు చేపట్టాలని, రోడ్లపై గుంతలు లేకుండా వెంటనే పూడ్చాలని సంబందిత అధికారులకు ఆదేశించాఉ. గణేశ్ నిమజ్జన ప్రొసీషన్ రూట్లలో బీటీ రోడ్డపై డీడీఏం లేయర్ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. నిమజ్జన ప్రదేశాల్లో భక్తులకు మౌళిక వసతులు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. ఈ తనిఖీల్లో శానిటేషన్,ఇరిగేషన్, ఇంజనీరింగ్ తదితర విభాగాల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో నిండిపోయిన జంట జలాశయాలు

- గండిపేట 8.గేట్లు, హిమాయత్ సాగర్ 3.గేట్లు ఎత్తిన అధికారులు
- నార్సింగి, మంచిరేవుల బ్రిడ్జిల వద్ద కాపలా కాస్తున్న పోలీసులు
- పొంగి పొర్లుతున్న ఈసీ,మూసీ నదులు



గండిపేట జలాశయం 8.గేట్లు ఎత్తి దిగువకు వరద నీరు వదిలిపెట్టిన జల మండలి అధికారులు

**నార్సింగి, ఆగస్టు 28 ప్రభాతవార్త :** దశాబ్దాల కాలంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహా నగర ప్రజల దాహార్తిని తీరుస్తున్న జంట జలాశయాలు గండిపేట్, హిమాయత్ సాగర్‌లు పూర్తిగా నిండిపోయాయి. గత ఐదారు రోజులుగా ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఎగువ నుంచి భారీ ఎత్తున వరద నీరు వచ్చి ఈ జలాశయాలలోకి చేరుతుంది. ఈ రెండు జలాశయాలు నీటి సామర్థ్యానికి మించి నిండడంతో జల మండలి గురువారం అధికారులు అప్రమత్తమై గేట్లు ఎత్తి దిగువన ఉన్న మూసీ, ఈసీ నదులలోకి పెద్ద ఎత్తున వరద నీటిని వదిలి పెట్టారు. దీంతో ఈ రెండు నదులు పొంగి పొర్లుతున్నాయి. గండిపేట, నార్సింగి, మంచిరేవుల బ్రిడ్జిల వద్ద నార్సింగి పోలీసులు పికెట్‌ను ఏర్పాటు చేసి ప్రజలు బ్రిడ్జిల వద్ద నిలబడకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు. సెల్ఫీల పేరుతో ఏ ఒక్కరి ప్రాణాలు కూడా ప్రమాదం పాలు కాకుండా ఉండాలని నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి ముందు జాగ్రత్తగా మూడు బ్రిడ్జిల వద్ద పోలీసు పికెట్లను ఏర్పాటు చేశారు. ఇక మున్సిపల్, రెవెన్యూ, జల మండలి అధికారులు దిగువ ప్రాంతాలలోని ప్రజలను అప్రమత్తం చేశారు. సురక్షిత ప్రాంతాలకు తరళి వెళ్లాలని, రెండు జలాశయాల గేట్లు ఎత్తడం జరిగిందని సైరన్‌లు, చాటింపులు వేశారు. ఇప్పటికే పలువురు ప్రజలను ఇళ్లు ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు.

**గండిపేట :** ఈ జలావయం పూర్తి సామర్థ్యం 1790ఫీట్లు కాగా ఇప్పుడు 1789.85ఫీట్లకు చేరకుంది. పైనుంచి వరద ఉధృతి పెరుగుతుండడంతో ఈ జలాశయం 8.గేట్లను 3.ఫీట్ల మేర ఎత్తి దిగువకు భారీ ఎత్తున వరద నీటిని మూసీ లోకి వదలి పెట్టారు. ఈ జలాశయంకు ఇన్‌ఫ్లో 900.క్యూసెక్కులు కాగా 3,600.క్యూసెక్కుల నీటిని దిగువకు వదలారు.

**హిమాయత్ సాగర్ :** ఈ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 1763.50అడుగులు కాగా ఇప్పుడు 1763.15 అడుగు లకు చేరుకుంది. ఎగువ నుంచి వరద నీరు పెరుగుతుండం దంతో ఈ జలాశయం వద్ద 2.గేట్లను 34.ఫీట్లు, ఒక గేటు ను ఒక ఫీటు మేర ఎత్తి ఈసీ నదిలోకి వరద నీటిని వదిలి పెట్టారు. ఈ జలాశయంలోకి ఇన్‌ఫ్లో 2,200క్యూసెక్కులు కాగా, 2,300. క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలిపెడుతున్నారు.

### వినాయక భక్త బృందం వద్ద ఎంపీ ఈటల రాజేందర్ పూజలు



**కెపిహెచ్బి కాలనీ, ఆగస్టు 28, ప్రభాతవార్త**

కూకట్పల్లి బిజెపి కార్యాలయం వద్ద ప్రతిష్టించిన విఘ్నేశ్వరుని స్వర్ణోత్సవ పూజ వేడుకల్లో మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ బిజెపి రాష్ట్ర కార్య వర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావుతో కలిసి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే కూకట్‌పల్లి డివిజన్ పరిధిలో భజరంగ్ దళ్ వినాయక మండపం, టీం జూనియర్ భజరంగ్ దళ్ మండపం, వడ్డేపల్లి ఎంక్లేవ్ గేటెడ్ కమ్యూనిటీలో ప్రతిష్టించిన మట్టి వినాయకుడు, యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫిరోజ్‌గూడా మండపం, బోయిన్‌పల్లి పప్పు పటేల్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన హనుమాన్ యువసేన గణేష్ మండపాలను సందర్శించి స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ వినాయక చవితి పర్వదినం మన సాంప్రదాయాలకు ప్రతీక. విఘ్నేశ్వరుడు సమాజంలో ఉన్న ప్రతి విఘ్నాన్ని తొలగించి అందరికీ సుఖ శాంతులు ప్రసాదించాలి. ఐక్యత, సామరస్యానికి వినాయక ఉత్సవాలు దోహద పడతాయని పేర్కొన్నారు.

## 31న బంజారాల స్వర్ణోత్సవ ప్రచార రథయాత్ర ప్రారంభం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రవీంద్రనాయక్, జగన్‌నాయక్, రాజేష్‌నాయక్ తదితరులు

**సైఫాబాద్, ఆగస్టు 28 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బంజారా లంబాడీలకు స్వర్గీయ ప్రధాని ఇందిరాగాంధీ రిజర్వేషన్‌లు కల్పించి అర్ధ శతాబ్దం పూరైయిన సందర్బంగా స్వర్ణోత్సవాల ప్రచార రథయాత్ర, గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని భారత్ బంజారా తెలిపింది. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మాజీ ఎంపి ఎస్.రవీంద్ర నాయక్, బంజారా భారత్ కన్వీనర్ డా.జగన్‌నాయక్, బంజారా జెఏసి అధ్యక్షుడు డా.రాజేష్‌నాయక్ తదితరులు గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 31వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తిలో ఈ రథయాత్ర ప్రారంభమవుతుందని, సెప్టెంబరు 1, 2 తేదీలలో ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో, 3వ తేదీన అదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో, 4న మెదక్, రంగారెడ్డి జిల్లాలో , 5, 6 తేదీలలో హైదరాబాద్‌లో జరుగుతుందన్నారు. అలాగే సెప్టెంబరు 13, 14 తేదీలలో ఈ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను నక్లెస్‌రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్నామని, ఈ ఉత్సవాల్లో సిఎం రేవంత్‌రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ తదితరులను పాల్గొనాలని ఆహ్వానించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో బంజారా నాయకులు రాఘవనాయక్, సూర్యనాయక్, స్వామి నాయక్, కిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం,
శేరిలింగంపల్లి జోన్: GHMC, Mail: sew.ghmc@gmail.com
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

నిట్ నెం: 23/SE/SLPZ/GHMC/2025-26, తేది: 28.08.2025
పనిపేరు: GHMC, SLPZ, లో నాన్ CRMP రోడ్ డ్రైన్‌లు మరియు CRMP యొక్క మెయిన్ రోడ్ డ్రైన్‌లపై స్వీపింగ్ మెషిన్‌లను అద్దె ప్రాతిపదికను (01 ఐటమ్‌లు). అంచనా మొత్తం/ECV (రూ.లక్షలలో): 56.00 లక్షలు. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ, చివరి తేదీలు, సమయం : 29.08.2025 మ.1.00గం., 01.09.2025 మ.1.30గం. అధికారి పేరు చిరునామా మరియు సెల్ నెం: SE, SLPZ, GHMC. సెల్ నెం. 7331186858.
సం/-. సూపరింటెండింగ్ ఇంజనీర్, శేరిలింగంపల్లి జోన్, GHMC.
DIPR.NO. 7220-PP/CL/ADVT/1/2025-26 తేది: 28.08.2025


## విద్యావలంటీర్‌కు లయన్స్‌క్లబ్ చేయూత

**శేరిలింగంపల్లి, ఆగస్టు 28 ప్రభాతవార్త**

నిరుపేద విద్యార్థులకు విద్యనందిస్తున్న విద్యావాలింటర్లను చేయూతనందించేందుకు తమవంతు ఇతోదిక సహాకారం అందిస్తున్నామని లయన్ స్‌క్లబ్ హోప్ ప్రధాన కార్యద ర్శి,హోప్ స్వచ్ఛంద సంస్థ ఛైర్మన్ కొండ విజయ్ కుమార్ అన్నారు. గంగారం ప్రభు త్వ పాఠశాలలో విద్యావాలింటరీగా విదులు నిర్వహిస్తున్న సీతారాధికకు లయన్ స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ తరపున లయన్స్‌క్లబ్ హోప్ ఆధ్వర్యంలో రెండునెలల జీతం దాదాపు 24వేల రూపాయలను చెక్‌రూపంలో అందజేశారు. విద్యావాలింటర్లకు ప్రతి నెల స్వచ్ఛందంగా సంస్థలు ముందుకు వచ్చి జీతాలను అందించటం జరుగుతుం దన్నారు. ఈ మేరకు లయన్స్‌క్లబ్ ముందుకురావడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుభాష్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్ స్‌క్లబ్ జోన్ ఛైర్మన్ బసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, క్లబ్ కోశాధికారి బర్కా మల్లేశ్‌యాదవ్, మారం ప్రసాద్; బశ్వరాజ్, అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ బీమమ్మ, ఉపాధ్యాయ కమిటీ నరహరి తదితరులు పాల్గొన్నారు.

### సిఎం ఇచ్చిన హామీని అమలు చేయాలి : బాధిత రైతులు విజ్ఞప్తి

**సైఫాబాద్, ఆగస్టు 28 ప్రభాతవార్త:** టిపిసిసి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలను రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం, కొంగర ఖుర్ద్ గ్రామం రైతులు విజ్ఞప్తి చేశారు. హైకోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్‌ను అమలు చేయాలని రైతులు కోరారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ గ్రామం బాధిత రైతులు ఎన్.వెంకటేష్‌గౌడ్, శేషగిరిరావు, ఎస్.కృష్ణారెడ్డి, గోపాల్, నారాయణ మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నెంబరు 2 నుంచి 400 వరకు గల 200 ఎకరాల భూమిని కొంత మంది ట్యాంపరింగ్ చేసి లేఅవుట్లు ద్వారా క్రయవిక్రయాలు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో రైతులంతా ఏకమై హైకోర్టును ఆశ్రయించామని, కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చిందని, కొంత మంది అధికారులు రాజకీయ నాయకులు, భూకబ్జాదారులతో కుమ్మకై అక్రమాలకు పాల్పడుతున్నారని చెప్పారు. రేవంత్‌రెడ్డి పిసిసి అధ్యక్షుడిగా ఉన్న సమయంలో తాము వినతి పత్రాన్ని అందించామని, ఆయన ఈ భూమి విషయం తనకు తెలుసునని, అధికారంలోకి వచ్చిన తరువాత పరిష్కారిస్తామని హామీ ఇచ్చారని వారు ఈ సందర్బంగా గుర్తు చేశారు.


IN THE COURT OF THE HON'BLE I Addl. Senior Civil Judge cum Addl Chief Judicial Megistrate AT: Malkajgiri

O.S. No. 559 of 2025

Between:
K. C. Vishal & another ...Plaintiffs
AND
ALL CONCERNED ...Respondents

Please take Notice that anyone concerned in the above O.S. No. 559 of 2025, for declaration of civil death and legal heirs, the case is posted for your appearance in the above Suit on 17-09-2025.
If you fail to attend before the Hon'ble Court in the above suit on 17-09-2025 at 10:30 A.M. the matter will be decided Exparte.
By order of the Hon'ble I Addl. Senior Civil Judge cum Addl Chief Judicial Megistrate, AT: Malkajgiri

SIVA KUMAR SURADA
ADVOCATE, B.Com, L.L.B
P.No. 47, Padmasri Nilayam, Chakripuram, Hyderabad 500062.
Cell no: 8520043333
Malkajgiri
20-08-2025



IN THE COURT OF THE XI JUNIOR CIVIL JUDGE, C.C.C. AT SECUNDERABAD
O.S No. 680 of 2025

Between:
Smt. Kancherlapalli Kalyani & another ...Plaintiffs
AND
Tahsildar, Secunderabad Mandal and others ...Defendants
To,
All Concerned
Please take notice that the above Plaintiffs have filed O.S. No. 680 of 2025 on the file of XI Junior Civil Judge, CCC, Secunderabad to declare them as legal heirs of late Kancharlapalli Hari Babu. The above suit stands posted to **15.09.2025.** If anyone have objections in the matter they may appear in the Hon'ble Court on the said date their personally or through Advocate and file their objections, else the suit will be decided on merits treating the objections as nil.
//By the Order of the Hon'ble Court//

K.V. KRISHNA RAO, B.Sc., LL.B.
ADVOCATE
#202, Sai Sudha Residency, H.No.1-1-336/39/A/3, Chikkadpally, Hyderabad-500020
Mobile No. 9849021916



COURT NOTICE
IN THE COURT OF THE HON'BLE XIV ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURT, HYDERABAD
O.S. No. 298 of 2025

Between:
1. Sri. Narsin Srinivas, S/o Late Narsin Krishnaiah, Aged 50 yrs, Occu: Business, R/o H.No.10-22, Road No.3, SBI Colony, Near Saraswathi Temple, Saroomagar, Rangareddy District, Telangana
2. Smt. Narsin Shamanthakamani, W/o Late Narsin Krishnaiah, Aged 72 yrs, Occu: Household, R/o H.No.10-22, Road No.3, SBI Colony, Near Saraswathi Temple, Saroomagar, Rangareddy District, Telangana
3. Smt. Rajani Puram, W/o Naveen Kumar Puram, Aged 49 yrs, Occu: Household, R/o H.No.2-4-82, 49/A, Ramgopalpet, Opp: CNR Transport, Secunderabad, Hyderabad District, Telangana
4. Smt. Palepu Sangeetha, W/o Palepu Shekar, Aged 55 yrs, Occu: Household, R/o H.No.12-7-112/26/1, Plot No.81, Keshav Nagar Colony, Near RRB, Mettuguda, Secunderabad, Hyderabad District, Telangana. ... Plaintiffs

AND
1. The Tahsildar, Amberpet Mandal, Hyderabad District.
2. The Tahsildar, Saidabad Mandal, Hyderabad District.
3. The Tahsildar, Patancheru Mandal, Sangareddy District.
4. All Concerned ... Defendants

NOTICE
The above-named Plaintiffs have filed the above suit for declaration to declare them as legal heirs of Late Narsin Krishnaiah S/o Narsin Dubbaiah, who died intestate on 25-08-2023, leaving behind the Plaintiffs as his Class-I legal heirs and successors. Notice is hereby given that the said suit is filed before the Hon'ble XIV Additional Chief Judge, City Civil Court, Hyderabad, and the above suit stands posted on 03-09-2025 for objections. If any person/s have any objection, they may appear before the Hon'ble Court on the said date at 10:30 A.M. either in person or through an Advocate, failing which the matter will be decided as per law in your absence. **Schedule of Property-A:** All that the 253 Sq. Yards House in Plot No.58, Door No.17-1-382/V/1/58, New Science Colony, Saidabad, Hyderabad. PTIN No.1041728818. **Boundaries: North:** Plot No.89. **South:** Plot No.57. **East:** 30 Feet Road. **West:** Staff Road. **Schedule of Property - B:** All that the 32 Sq. Yards House bearing H.No.2-4-1021/3, Nimboli Adda, Kachiguda, Hyderabad. PTIN No.1090226731. **Boundaries: North:** Road. **South:** Plot No.2-4-1021/2 **East:** Plot No.2-4-1021/4. **West:** Plot No.2-4-1021/1
(BY ORDER OF THE COURT)
M/s V. Shiva Kumar
Advocate
Hyderabad. Mobile: 8074486284



NOTICE
IN THE COURT OF THE CHAIRMAN: MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL-CUM-XIPRINCIPAL DISTRICT JUDGE: RANGAREDDY DISTRICT,AT: LB NAGAR
M V O P NO: 333 of 2025

Between:
Gadila Anithaand Others ....Petitioner
AND
R Shivani Deviand Others ...Respondents
To,
1. Rakesh Kumar S/o Devraj Age: Major, Occ: Business R/o: 11-27/10, Check post Medchal, Telangana - 501401
Please take notice that the above-named Petitioner filed a MV OP for Compensation against you and the said case stands posted to 18-09-2025 for your appearance.
Therefore, you are hereby directed to appear before The HON'BLE XIPRINCIPAL DISTRICT JUDGE, RANGAREDDY DISTRICT, At: LB NAGAR on dated:18-09-2025at 10.30 AM either in person or through an Advocate, failing which the matter will be decided Exparty.
( By the Order of the Court )

M/S . CHTVLNARASIMHA REDDY
S. YADAGIRI
M. SUMALATHA
Advocates
H.No.10-1-5/5-001, Prathinav Residency, Nehru Nagar, West Marred Pally Secundrabad-500026
COUNSEL FOR THE PETITIONER

### ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడానికి కృషి : అబ్రార్



అజంపురలో రోడ్డు నిర్మాణం పనులను పరిశీలిస్తున్న ఎంఐఎం డివిజన్ అధ్యక్షుడు అబ్రార్ , మల్లికార్జున్ తదితరులు

**మలక్ పేట ,ఆగస్టు 28, ప్రభాతవార్త:** ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తున్నామని అజంపూర డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు అబ్రార్ పేర్కొన్నారు. ఆర్ యుబి బ్రిడ్జి వద్ద నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణం పనులను జిహెచ్ఎంసి ఎఇ మల్లికార్జున్, సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని, అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రతినిత్యం డివిజన్ లోని పలు ప్రాంతాలలో వివిధ శాఖల అధికారులతో కలిసి పాదయాత్రలు చేస్తూ, స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### నూతన వినాయక మండపాన్ని ప్రారంభించిన కార్పొరేటర్



**ఉప్పల్, ఆగస్టు 28 ప్రభాతవార్త**

శ్రీనగర్ కాలనీలో కాలనీ అసోసియేషన్ సభ్యుల సొంత నిధులతో నిర్మించుకున్న నూతన వినాయక షెడ్ మరియు మండపాన్ని వినాయక చవితి పండగ సందర్భంగా చిలుకా నగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం కార్పొరేటర్ గీత,ప్రవీణ్ మాట్లాడుతూ వినాయక చవితి పండగ పర్వదినాన నూతన వినాయక మండపం మరియు షెడ్ ని ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. కాలనీ అసోసియేషన్ సభ్యుల ఐక్యతకు మారుపేరుగా నిలిచిన శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను అభినందిస్తూ సొంత నిధులతో షెడ్డు ఏర్పాటుకు సహకరించిన సభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు , తెలుపుతూ బ్యాలెన్స్ వర్క్ ప్రహరీ గోడ ఎత్తు పెంచడం,గేట్,సిమెంట్ ఫ్లోరింగ్, ఎలక్ట్రికల్ పోల అండ్ లైట్ ని ఏర్పాటు చేస్తానని అసోసియేషన్ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీనగర్ కాలనీ అధ్యక్షులు కొండయ్య, మురళీధర్ రెడ్డి , శ్రీనివాస్, వేణుగోపాల్ రెడ్డి, యువ సాయి , ప్రభాకర్ రెడ్డి, దినేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు

### ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుని విగ్రహాలను మాత్రమే వాడాలి

**కుషాయిగూడ, ఆగస్టు 28, ప్రభాతవార్త.** ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను వినియోగించి జల కాలుష్యాన్ని నివారి, పర్యావరణాన్ని పరిరక్షించాలని బిజెపి మీర్పేట్ డివిజన్ అధ్యక్షులు మునిగంటిరాం ప్రదీప్ పేర్కొన్నారు.వినాయక చవితి సందర్భంగా మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్‌లోని అన్ని కాలనీ అసోసియేషన్లకు,కుల సంఘాలకు మట్టి వినాయక విగ్రహాలను డివిజన్ అధ్యక్షులు శ్రామ్ ప్రదీప్ మునుగంటి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

### డిఎస్ఎల్ వర్చు మాల్‌లో ఆకట్టుకుంటున్న 80 వేల తమలపాకుల గణపతి

**ఉప్పల్, ఆగస్టు 28 ప్రభాతవార్త**



ఉప్పల్ డిఎస్ఎల్ వర్చు మాల్, తూర్పు హైదరాబాద్ యొక్క ఇష్టమైన షాపింగ్ లో వినాయక చవితి పండుగ సందర్భంగా గణేష్ చతుర్థిలో భాగంగా సుమారు 80,000 కంటే ఎక్కువ తమలపాకులను ఉపయోగించి గణేష్ తయారు చేశారు. అద్భుతమైన పర్యావరణ అనుకూలమైన గణేశ విగ్రహాన్ని గర్వంగా ఆవిష్కరించారు. గ్రీన్ గణేష్ వేడుకలను ప్రోత్సహించడానికి మరియు స్థిరమైన సంప్రదాయాలను స్వీకరించడానికి సమాజాన్ని ప్రేరేపించడానికి మాల్ యొక్క నిబద్ధతలో ప్రత్యేకమైన తయారీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రధాన ద్వారం ముందు ఎత్తుగా నిలబడి, ఈ క్లిష్టమైన మరియు కళాత్మక విగ్రహాన్ని నైపుణ్యం కలిగిన విగ్రహాన్ని పలువురు కళాకారులు రూపొందించారని చెప్పారు. ఈ కళాఖండాన్ని రూపొందించడానికి తమలపాకులను వారాలపాటు నిశితంగా సమీకరించారని తెలిపారు. విగ్రహం పూర్తిగా జీవఅధోకరణం చెందుతుందని, ఉత్సవాల తర్వాత జీరో వేస్ట్ విసర్జన్‌ను నిర్ధారిస్తుందని తెలిపారు. సంప్రదాయం, కళ మరియు సుస్థిరతను సామరస్యంగా జరుపుకోవడానికి ప్రతి ఒక్కరూ ఈ గణేష్ చతుర్థిలో డిఎస్ ఎల్ వర్చు మాల్‌ను సందర్శించాలని నిర్వహకులు కోరారు.

## భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలు



పూజలో పాల్గొన్న సురేఖ భాస్కర్ రెడ్డి

**ఎల్.బి.నగర్, ఆగస్టు 28 ప్రభాతవార్త:**

గణేష్ చవితి ఉత్సవాలు ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆర్కే పురం డివిజన్ అల్కాపురి కాలనీలోని అల్కాపురి అసోసియేషన్ వారు నెలకొల్పిన మహా గణనాథుడికి ఆర్కేపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ దేప సురేఖ భాస్కర్ రెడ్డి, టీపీసీసీ సభ్యుడు దేవ భాస్కర్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిట్ట సుమతీ హరినాథ్ రెడ్డి, అల్కాపురి కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు ఉండవల్లి వంశీ, యాదవరెడ్డి, నాగేష్, శ్రీను (డల్లి), సాయి, అనీల్, సంతోష్, సారధి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా బాలాపూర్ గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



బాలాపూర్ గణనాథునికి పూజలు నిర్వహించిన సబితా ఇంద్రారెడ్డికి లడ్డూ ప్రసాదాన్ని అందజేస్తున్న ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి




స్వర్ణగిరి వెంకటేశ్వర స్వామి ఆలయ నమూనాలో తీర్చిదిద్దిన బాలాపూర్ గణేష్ మండపం

**సరూర్‌నగర్, ఆగస్టు 26 ప్రభాతవార్త:** ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, లడ్డూ వేలంలో ప్రఖ్యాతి గాంచిన హైదరాబాద్ నగర శివార్లలోని బాలాపూర్‌లో గణేష్ ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సారి కూడా ఆకట్టుకునే భారీ ఏర్పాట్ల మధ్య బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి ఉత్సవాలను ప్రారంభించింది. భువనగిరిలోని సుప్రసిద్ధ స్వర్ణగిరి దేవాలయం నమూనాలో నిర్మించిన సుందర మండపం ఈ సారి బాలాపూర్ గణేష్ ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మండపం ఆవరణలో ఏర్పాటు చేసిన అనంత పద్మనాభ స్వామి, లక్ష్మీదేవి విగ్రహాలు సైతం విశేషంగా ఆకట్టుకున్నాయి కాగా వినాయక నవరాత్రి ఉత్సవాల మొదటి రోజు బుధవారం సాయంత్రం మాజీ మంత్రి, స్థానిక మహేశ్వరం నియోజకవర్గ శాసన సభ్యురాలు పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి తన కుమారుడు కౌశిక్‌రెడ్డితో కలిసి హాజరై ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి పూజల అనంతరం ఆమెను శాలువాతో సన్మానించి సాంప్రదాయం ప్రకారం బాలాపూర్ గణేష్ మినీ లడ్డూను అందజేశారు. కాగా బాలాపూర్‌కు చెందిన బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి కూడా బాలాపూర్ గణేషునికి పూజలు నిర్వహించారు.

## పండుగలు సాంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి

: గౌరవాధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ

**మలక్ పేట ,ఆగస్టు 28, ప్రభాతవార్త:** పండుగలు సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ, అధ్యక్షులు పొద్దుటూరి రవీందర్, గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ అమేటి శ్రీనివాస్ లు పేర్కొన్నారు. హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూసారాంబాగ్ లోని అసోసియేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి వారు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మీ సందర్భంగా వారు మాట్లాడుతూ గణేష్ నవరాత్రులను పురస్కరించుకుని ప్రతిరోజు పలు ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. ఈ నెల 31వ తేదీ ఆదివారం ఉదయం అష్టోత్తర శత కలసాభిషేకం, ఏకాదశ వర్ణ కోటి పుష్పార్చన అనంతరం ప్రసాద వికరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా సెప్టెంబర్ 3వ తేదీ బుధవారం ఉదయం గణపతి మూలా మంత్ర హోమం, లక్ష్మీ కుబేర పూజ అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి సంవత్సరం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని తెలియజేశారు. కావున భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు తోట వెంకయ్య, ఉరే శ్రీనివాస్, పాల మధుసూదన్, ప్రధాన కార్యదర్శి రాముని రామనాథం, సంయుక్త కార్యదర్శి గౌత వివేకనంద్ గుప్తా, గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి వేముల శ్రీధర్, కోశాధికారి మిట్టపల్లి అంజయ్య, గౌరవ సలహాదారులు మోటుకూరి శ్రీనివాస్, ఉత్సవ సమితి మాజీ చైర్మన్ వరగంటి జయరాములు, మేనేజర్ రామారావు, సిబ్బంది భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



గణేష్ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ, అధ్యక్షులు పొద్దుటూరి రవీందర్, గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ అమేటి శ్రీనివాస్ తదితరులు

## మద్యం మత్తులో మూసినదిలో ఈత కోసం దిగిన ఓ వ్యక్తి గల్లంతు

### ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టిన చాదర్ ఘాట్ పోలీసులు

**మలక్ పేట ,ఆగస్టు 28, ప్రభాతవార్త:** మద్యం మత్తులో మూసీ నదిలో ఈత కోసం దూకిన ఓ వ్యక్తి గల్లంతైన సంఘటన చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి కథనం ప్రకారం.. ఓల్డ్ మలక్ పేట్ శంకర్ నగర్ ప్రాంతానికి చెందిన సలీం ఖురేషి(40) మూసి పరివాహక ప్రాంతం వెంబడి చాదర్ ఘాట్ శంకర్ నగర్ వద్ద మద్యం మత్తులో మూసి నదిలో ఈత కోసం దూకడంతో గల్లంతు అయ్యారు. సంఘటన గురించి తెలుసుకున్న చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి, సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టడంతో పాటు ఎన్ డిఆర్ ఎఫ్ బృందాలకు సమాచారం అందించారు. రంగంలోకి దిగి నఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలు సలీం ఖురేషి ఆచూకీ కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సలీం ఖురేషి కోసం మూసీ నదిలో గాలిస్తున్న ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలు

## త్వరలో స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులు ప్రారంభం : కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం. ఆగస్టు. 28.ప్రభాతవార్త**

బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎపిఆర్ క్రిస్టల్ విల్లాస్ దగ్గర నుంచి మహాలక్ష్మి నగర్ కాలనీ వరకు స్ట్రోమ్ వాటర్ డ్రైన్ నిర్మించేందుకు రాచకాలువను సంబంధిత అధికారులతో సర్వే నిర్వహించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి గారు మరియు ఇరిగేషన్ డిపార్ట్మెంట్ దీని శుక్లజ గారు మరియు సర్వేయర్ జ్యోతి గార్లతో కలిసి సర్వే నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు మాట్లాడుతూ త్వరలోనే స్ట్రోమ్ వాటర్ డ్రైన్ పనులు ప్రారంభమవుతాయని మరియు వీలైనంత త్వరగా పనులు ప్రారంభించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా లెవెల్స్ సరి చూసుకుంటూ పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డిపార్ట్మెంట్ తిని సతీష్, హైడ్రా శ్రీ. ముజాఫర్, లా ఆర్డర్ అనిల్,జలమండలి మేనేజర్ సి రివెన్నెల,ఇంజనీరింగ్ విభాగం తిని కార్తీక్, వర్కి ఇన్స్పెక్టర్ శ్రీకాంత్, జలమండలి వర్కి ఇన్స్పెక్టర్ రవీందర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మరియు పాల్గొన్నారు



స్ట్రాం వాటర్ డ్రైన్ నిర్మించేందుకు రాచకాలువను పరిశీలిస్తున్న అధికారులు, కార్పొరేటర్ లచ్చిరెడ్డి.

### బాలాపూర్ గణనాథునికి పీఠాధిపతి పూజలు



బాలాపూర్ గణేషునికి పూజలు చేస్తున్న ద్వారకాయి పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామీజీ

**సరూర్‌నగర్, ఆగస్టు 28 ప్రభాతవార్త:** సుప్రసిద్ధ బాలాపూర్ గణనాథుడిని ప్రథమ దత్తావతారమైన శ్రీపాద శ్రీవల్లభుల వంశంలో 34వ తరానికి చెందిన దత్త సిద్ధాంత ఆదికర్త, శ్రీద్వారకామాయి సాయిబాబా పీఠాధిపతి పూజ్యశ్రీ గోపాలకృష్ణానంద స్వామీజీ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత కొన్ని సంవత్సరాలుగా పీఠాధిపతి బాలాపూర్ గణేష్ నవరాత్రి ఉత్సవాలకు హాజరై పూజలు జరుపుతుండం విశేషం. ఈ క్రమంగా గురువారం పీఠాధిపతి బాలాపూర్ వినాయక మండపాన్ని సందర్శించగా ఉత్సవ నిర్వాహకులు స్వామీజీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పూజల తర్వాత పీఠాధిపతికి ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానం నిర్వహించి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాతాజీ మల్లాది విజయశ్రీ, లలిత్ సాయి కుమార్, అబ్బూరి సుధాకర్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

### జయశంకర్ కాలనీ డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి: నవారు మల్లారెడ్డి



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న బడంగ్‌పేట్ కార్పొరేషన్ డిఇఇ వెంకన్న

**సరూర్‌నగర్, ఆగస్టు 28 ప్రభాతవార్త:**

బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని 24వ డివిజన్ అల్మాస్‌గూడ జయశంకర్ కాలనీలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కార్పొరేషన్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ నవారు మల్లారెడ్డి కోరారు. కాలనీ డ్రైనేజీ సమస్యలను స్థానికులు దృష్టికి తేవడంతో స్పందించిన ఆయన కార్పొరేషన్ డిఇఇ వెంకన్నకు వివరించారు. ఈ నేపథ్యంలో ఆయన గురువారం మల్లారెడ్డితో కలిసి క్షేత్ర స్థాయిలో సమస్యను పరిశీలించారు. ఈ మేరకు ఆధునిక బకెట్ మిషన్ విధానంతో కాలనీ డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తామనీ అదే విధంగా అవసరమైన చోట మరమ్మతు పనులు చేయిస్తామని హామీనిచ్చారు.

## సరూర్‌నగర్ ఉప కమిషనర్‌గా శ్రీనివాస్

**ఎల్.బి.నగర్, ఆగస్టు 28 ప్రభాతవార్త:**

సరూర్ నగర్ సర్కిల్ నూతన ఉప కమిషనర్ గా బోనగిరి శ్రీనివాస్ గురువారం బాధ్యతలు చేపట్టారు. సిడిఎంఎ జాయింట్ డైరెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న భువనగిరి శ్రీనివాస్ సరూర్ నగర్ సర్కిల్ ఉప కమిషనర్ గా బదిలీ అయ్యారు. సరూర్ నగర్ ఉప కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆకుల సుజాత జిహెచ్ఎంసి హెడ్ ఆఫీస్‌కి బదిలీపై వెళ్లారు.

## గణపతి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే



పూజలో పాల్గొన్న సుధీర్ రెడ్డి

**ఎల్.బి.నగర్, ఆగస్టు 28 ప్రభాతవార్త:**

ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి చైతన్యపురి డివిజన్ ఫణిగిరికాలనీలోని శ్రీ వెంకటసాయినగర్లోని వినాయక మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు తోట మహేష్ యాదవ్, చైతన్యపురి డివిజన్ భారస నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, సాయిబాబా గుడి చైర్మన్ శ్రీనివాస్ నాయుడు, నరసింహ, ప్రసాద్, హరిశంకర్, ప్రభాకర్, సాయి పాల్గొన్నారు.

### మాలిక్యులర్ బయాలజీ-బయోటెక్నాలజీపై వర్క్‌షాప్



**నేరేడ్‌మెట్,సైనిక్‌పురి, ఆగస్టు 28:ప్రభాతవార్త**

భవన్స్ వివేకానంద కళాశాల ఆఫ్ సైన్స్, హ్యూమానిటీస్ అండ్ కామర్స్, జనెటిక్స్ బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో మాలిక్యులర్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ వర్క్‌షాప్”..ను ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం/12వ తరగతి బయాలజీ విద్యార్థుల కోసం నిర్వహిస్తోంది.రెండు రోజులపాటు జరిగే ఈ వర్క్‌షాప్‌లో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొంటున్నారు. జీవశాస్త్రాలపై ఆసక్తి పెంపొందించేలా, ఉన్నత విద్యను కొనసాగించేందుకు ప్రేరణ కలిగించేలా మాలిక్యులర్ బయాలజీ, బయోటెక్నాలజీ పరిజ్ఞానం, ప్రాక్టికల్ హ్యాండ్స్ ఆన్ అనుభవం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.విద్యార్థులు ప్రత్యక్షంగా ల్యాబ్‌లో జీన్ల విభజన, డీఎన్ఏ ఎక్స్ట్రాక్షన్, బయోటెక్నాలజీ సంబంధిత ఇతర ప్రాథమిక సాంకేతికతలను నేర్చుకుంటారని, శాస్త్రీయ రంగంపై ఆసక్తి కలిగిన యువతకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరమని వక్తలు పేర్కొన్నారు.

### కట్టమైసమ్మ దేవాలయంలో కార్పొరేటర్ శ్రీవాణి పూజలు



**ఉప్పల్, ఆగస్టు 28 ప్రభాతవార్త**

గణేష్ నవరాత్రుల సందర్భంగా రామంతపూర్ కట్టమైసమ్మ దేవాలయంలో ఏర్పాటు చేసిన గణనాథుని వద్ద ప్రత్యేక గణపతి హోమం కార్యక్రమంలో రామంతపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు మాట్లాడుతూ గణనాథుడు విఘ్నాలను తొలగించి సర్వజనులకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మనసారా ప్రార్థిస్తు, రామంతపూర్ ప్రజలు అభివృద్ధి, ఆనందం, ఐకమత్యంతో ముందుకు సాగాలని గణపతి ఆశీస్సులు కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో నవీన ఆచార్య, వాక నరసింహారావు, రాణా ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

### మేడిపల్లి మారుతి నగర్ నూతన కమిటీ ప్రమాణస్వీకారం



మేడిపల్లి మారుతి నగర్ నూతన అధ్యక్షులుగా గూడూరు పాండురంగారెడ్డి ,ప్రధాన కార్యదర్శిగా ముత్తినేని రాజు ,కమిటీ మెంబర్లు వినాయక మండపంలో ప్రమాణస్వీకారం చేస్తున్న దృశ్యం

**మేడిపల్లి, ఆగస్టు 28 ప్రభాతవార్త;**

మారుతి నగర్ కాలనీ నూతన అధ్యక్షులుగా గూడూరు పాండురంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ముత్తినేని రాజు, వైస్ ప్రెసిడెంట్ నాన్నపనేని సృజన, జే బీరప్ప, డి సంజీవరెడ్డి , ట్రెజరర్ వంగాల సతీష్, సలహాదారులుగా ఎం చంద్రమోళి, బి చంద్రశేఖర్ రెడ్డి ,వి హరికృష్ణ రెడ్డి , లీగల్ అడ్వైజర్ ఎన్ మల్లేశ్వర రావు , కార్యదర్శులు, మెంబర్ల కమిటీ సభ్యులను ప్రమాణస్వీకారం చేయించిన ముఖ్య సలహాదారులు జి మల్లారెడ్డి, కె నారాయణ రెడ్డి , డి యాదగిరి రెడ్డి , ఆర్ యాదగిరిఈ కార్యక్రమమునకు అతిథులుగా వచ్చిన మాజీ కార్పొరేటర్ వై అనంతరెడ్డి ,బీర్ల శంకర్ వివిధ కాలనీ అధ్యక్ష కార్యదర్శులు మారుతీ నగర్ కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొని నూతన కమిటీని సన్మానించుకోవడం జరిగింది. ఈ యొక్క నూతన కమిటీ రాబోవు రెండు సంవత్సరాలు పదవిలో కొనసాగి మారుతి నగర్ ను అభివృద్ధి పథంలో పయనింపచేయాలని మాజీ కార్పొరేటర్ యాంపల్ల అనంతరెడ్డి , బీర్ల శంకర్ కొనియాడారు .

### 14 నుంచి జాతీయ కరాటే పోటీలు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 28 ప్రభాతవార్త:**

విక్టరీ షోటోకాన్ కరాటే అసోసియేషన్ డో ఇండియా ఆధ్వర్యంలో సెప్టెంబర్ 14వ తేదీన బొమ్మకు బాలయ్య గార్డెన్స్ లో జాతీయ స్థాయి కరాటే పోటీలు నిర్వహిస్తామన్నామని టోర్నమెంట్ నిర్వాహకులు ఆర్.మల్లికార్జున గౌడ్, అసోసియేషన్ చైర్మన్ కొమాకుల సదాశివుడు తెలిపారు. 14 రాష్ట్రాల విద్యార్థి విద్యార్థులు ఈ పోటీలో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథులుగా రాష్ట్ర మంత్రులు, పిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, సినీ హీరో సుమన్ తల్వార్, నారాయణ గ్రూప్ తెలంగాణ జీఎం కుక్కునూరి గోపాల్ రెడ్డి, పోలీస్ అధికారులు, కార్పొరేటర్లు, నాయకులతో పాటు వివిధ రాష్ట్రాలు, జిల్లాలకు చెందిన కరాటే మాస్టర్లు పాల్గొంటారన్నారు. మార్షల్ ఆర్ట్స్ కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న సంగతి ప్రతి విద్యార్థికి తెలియాలని అన్నారు. ఈ పోటీలలో దాదాపుగా 1500 క్రీడాకారులు పాల్గొంటారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

### టీజీఎస్ పీడీసీఎల్ సీఎండీ ముషార్రఫ్ అలీని కలిసిన తోటకూర అజయ్ యాదవ్



సిఎండి ముష్రఫ్ అలీని కలిసిన మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ,కొత్త కిషోర్ గౌడ్ ,కుంభం కిరణ్ కుమార్ రెడ్డి

**బోడుప్పల్ ఆగస్టు 28 ప్రభాతవార్త ;**

బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న రోడ్డు వెడల్పు పనుల నేపథ్యంలో విద్యుత్ స్తంభాల మార్పు అంశంపై చర్యలు తీసుకోవాలని సీఎండీ ముషార్రఫ్ అలీని బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ మింట్ కాంపౌండ్‌లోని కార్యాలయంలో కలసి విజ్ఞప్తి చేశారు. సీఎండీ ముషార్రఫ్ అలీ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చోట స్తంభాల పునర్వ్యవస్థీకరణకు తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ చర్యల ద్వారా రాబోయే రోజుల్లో బోడుప్పల్ వాసులకు ప్రయాణ సౌకర్యం తంగా, ట్రాఫిక్ సమస్యలు తగ్గడం జరుగుతుందని మాజీ మేయర్ అజయ్ యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు.సీఎండీని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ కుంభం కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.

### గణేష్ పూజలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**మల్కాజిగిరి ఆగస్టు28,ప్రభాతవార్త :**

ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ లోని శ్రీనగర్ కాలనీలో కాలనీ వాసులు ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని సందర్శించి మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

### భక్తులను ఆకట్టుకుంటున్న 26 అడుగుల సాహెబ్ నగర్ గణేశుడు



గణేశునికి పూజలు నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ లక్ష్మి ప్రసన్న రామ్మోహన్ గౌడ్.

**వనస్థలిపురం.ఆగస్టు.28.ప్రభాతవార్త.**

వినాయక చవితి పర్వదినం సందర్భంగా నవరాత్రులను పురస్కరించుకొని సాహెబ్ నగర్ శ్రీరామ గణేష్ యూత్ అసోసియేషన్ 41వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీరామ గణేష్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు ముద్దగౌని జగన్ గౌడ్ ఆధ్వర్యంలో సాహెబ్ నగర్‌లో 26 అడుగుల ఎత్తు గల గణనాధుని నెలకొల్పారు. బుధవారం రాత్రి మొదటి రోజు పూజకు బి.ఎన్.రెడ్డి నగర్ మాజీ కార్పొరేటర్‌ముద్దగౌని లక్ష్మీ ప్రసన్న రామ్మోహన్ గౌడ్ గారు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంలో శ్రీ రామ గణేష్ యూత్ అసోసియేషన్ సభ్యులు ముద్దగౌని రంజిత్ గౌడ్,మానవ్ గౌడ్ , సతీష్ గౌడ్,నవీన్ గౌడ్, నర్సింహా, నాగరాజు,అర్జున్ చింటు, కోటేష్,విజయ్,తేజ తదితరులు పాల్గొన్నారు.

## వాసవి కాలనీలో ఘనంగా గణనాథుడి పూజలు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న కాలనీవాసులు

**వనస్థలిపురం.ఆగస్టు.28.ప్రభాతవార్త.**

ఆర్కే పురం డివిజన్ వాసవి కాలనీ సంక్షేమ సంఘము అధ్యక్షుడు గౌరిశెట్టి చంద్ర శేఖర్ గుప్తా ఆధ్వర్యంలో మహాగణపతి 38వ నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణనాథుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి అయిత అంజయ్య, అష్టలక్ష్మీ దేవాలయ అక్షయ ట్రస్ట్ సెక్రటరీ మాద్యం సుధాకర్ గుప్తా, ఉత్సవ కమిటీ కన్వీనర్ బచ్చు ప్రభాకర్, కో కన్వీనర్ ..వెంపటి కృష్ణ మోహన్, చిలుక ఉపేందర్ రెడ్డి, గౌరిశెట్టి శ్రీనివాస్, అరుణ్ కుమార్, వనమా సుదర్శన్, గ్రంథి రమేష్, తమన్నా శ్రీధర్, భరద్వాజ్, దండు రాజు, వినోద్, గౌరీ శంకర్, సత్యనారాయణ, మాలే శ్రీనివాస్, శుభకర్, శేఖర్, కృష్ణ మూర్తి, రామ స్వామి తదితరులు పాల్గొన్నారు.

### మహేశ్వరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినాయక చవితి వేడుకలు



క్యాంపు ఆఫీస్‌లో ప్రతిష్ఠించిన గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్యే, పార్టీ నాయకులు, మహిళలు

**సరూర్‌నగర్, ఆగస్టు 28 ప్రభాతవార్త:** జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డులోని మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రతిష్ఠించిన గణనాథునికి ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పట్లోళ్ళ కౌశిక్‌రెడ్డి, అర్కల కామేష్‌రెడ్డి, రామిడి రాంరెడ్డి, పల్లె జంగయ్యగౌడ్, బోయపల్లి శేఖర్‌రెడ్డి, పొరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, దిండు భూపేష్‌గౌడ్, మాదరి రమేష్, జెనిగె శ్రీనివాస్ యాదవ్, లలితానగర్, నిర్మలారెడ్డి, గీత, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.